

రూ.57 లక్షలతో బలుసులమ్మకు అలంకరణ



శరన్నవరాత్రి ఉత్సవాల్లో గురువారం తాడేపల్లిగూడెం బలుసులమ్మను మహాలక్ష్మిగా అలంకరించారు. రూ.57 లక్షల విలువైన నోట్లతో ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారిని, మండపాన్ని చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో క్యూకట్టారు. ఏర్పాట్లను నిర్వాహకుడు శ్రీ రంగా అంజి పర్యవేక్షించారు.
- తాడేపల్లిగూడెం (ఆంధ్రజ్యోతి):



ఏలూరు నుంచి విజయవాడకు బస్సులో వెళ్లేందుకు సిద్ధమైన టీచర్లు

కొత్త టీచర్ల మెగా జోష్ !

- వెలగపూడిలో ఉద్యోగ నియామక పత్రాలు అందజేత
- కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు తీరనున్న ఉపాధ్యాయుల కొరత

5

నేటి నుంచి డిగ్రీ రెండో విడత అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్లు

నిర్వాసితులకు భూసేకరణ వేగవంతం : కలెక్టర్



ఏలూరు,సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల ఆర్‌అండ్‌ఆర్ పనుల్లో భాగంగా భూసేకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి గురువారం జూమ్ కాన్ఫరెన్స్‌లో ఆదేశించారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో భూమికి భూమి, కాలనీల నిర్మాణాలకు 4,434 ఎకరాలు అవసరం కాగా, ఇప్పటికే బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో గుర్తించిన భూములకు సంబంధించి భూసేకరణ ప్రకటన జారీ చేయాలని, పరిహారాన్ని ప్రభుత్వ నిబంధనలకు ప్రకారం చెల్లించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సబ్ కలెక్టర్ బి.వినూత్న, డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, ఆర్డీవో అంబరీష్ పాల్గొన్నారు.

- జిల్లాలో జీఎస్టీ భారం తగ్గింపుతో ప్రతీ కుటుంబానికి ప్రతీ నెలా ఎంత మేర ఆదా అవుతుందో తెలియజేసేందుకు ఈనెల 26 నుంచి అక్టోబరు 19 వరకు జిల్లాలో సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ పేరుతో విస్తృత అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. వివిధ శాఖల అధికారులతో జీఎస్టీ 2.0పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గురువారం ఆమె టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.
- ఏలూరు నగరంలో వాయు కాలుష్యం నియంత్రణకు పటిష్ఠ ప్రణాళిక అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్‌పై ఆమె సమీక్షించారు. వాయు కాలుష్యం నియంత్రణకు కేంద్ర పర్యావరణశాఖ విడుదల చేసిన నిధులతో చేపట్టే పనులను పూర్తి చేయాలన్నారు. గాలిలో దుమ్ము,ధూళి శాతాన్ని మిషన్ ద్వారా పరీక్షలు జరిపే డిజిటల్ డిస్‌ప్లే బోర్డును అక్టోబరు 10వ తేదీ లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, ప్రాంతీయ కాలుష్య నియంత్రణ మండలి ఈఈ వెంకటేశ్వరరావు, కమిషనర్ కె.భానుప్రతాప్, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం సుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు.

పశుసంవర్ధకశాఖ ఏడీకి పదోన్నతి..బదిలీ

ఏలూరు,సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లా పశుసంవర్థశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎం.సంధ్యకు డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించారు. ఆమెకు ఒంగోలు డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈమె స్థానంలో ఇంకా ఎవరిని నియమించలేదు.

దీపం-2 గ్యాస్ సబ్సిడీ సొమ్ము జమపై చర్యలు

- ఎల్‌పీజీ గ్యాస్ డీలర్లతో డీఎస్‌వో సమావేశం



ఏలూరుసిటీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభు త్వం ఉచితంగా గ్యాస్ సిలిం డర్‌ను లబ్ధిదారులకు అందిం చడానికి దీపం-2 పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వడానికి నిర్దేశించిన ఈ పథకంలో తొలుత లబ్ధిదారుడు గ్యాస్ సిలిం డర్‌ను తీసుకునేటప్పుడే ధర సొమ్మును చెల్లిస్తారు. ఆపై వినియోగదారులు చెల్లించిన ఆ మొత్తం సబ్సిడీగా వినియోగ దారుడి బ్యాంకు ఖాతాకు జమ అవుతుంది. అయితే కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఈ పథకానికి అర్హులైన వారిలో ఏలూరు జిల్లాలో 800 మందికి పైగా సబ్సిడీ సొమ్ములు బ్యాంకు ఖాతాల్లో జమకాలేదు. ఈ పరిస్థితులను గమనించిన రాష్ట్ర ప్రభుత్వం గ్యాస్ ఏజెన్సీలతో సమావేశాలు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని సూచించింది. ఈక్రమంలోనే జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి ఈబీ విలియమ్స్ గురువారం ఏలూరులోని డీఎస్‌వో కార్యాలయంలో ఎల్‌పీజీ గ్యాస్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఎల్‌డీఎం నీలాద్రి పాల్గొని బ్యాంకు సమస్యలను వివరించారు. ఆధార్ బ్యాంకు ఖాతాకు లింక్ కాకపోవడం, ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్ కార్పొ రేషన్ ఆఫ్ ఇండియా) సమస్య వల్ల కొంతమంది గ్యాస్ వినియోగదారులకు అర్హత ఉన్నా సబ్సిడీ సొమ్ములు అందలేదు. అర్హత ఉండి సబ్సిడీ సొమ్ములు బ్యాంకుల్లో జమకాని వారి జాబితాలను ఎల్‌పీజీ డీలర్లకు అం దించి, ఈ సమస్యలను నాలుగు రోజుల్లో పరిష్కరించాలని డీఎస్‌వో కోరారు. గిరిజన ప్రాంతాల్లో గతంలో ట్రైబల్ ప్యాకేజీ కింద 5 కేజీలు గ్యాస్ సిలిండర్‌లు ఉచితంగా అందించారని, వాటి స్థానే 14.2 కిలోల గ్యాస్ సిలిండర్‌ను ఉచితంగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. జిల్లాలోని హెచ్‌పీసీ ఎల్, బీపీసీఎల్, ఐవోసీఎల్ గ్యాస్ కంపెనీలకు సంబంధించి 57 ఏజన్సీల డీలర్లు పాల్గొన్నారు.



ఆక్వా చెరువులకు.. రిజిస్ట్రేషన్!

లేదంటే వర్తించని ప్రభుత్వ రాయితీలు

> ఆక్వా సాగు చేయాలంటే ఇక రిజిస్ట్రేషన్ తప్పనిసరి. ప్రభుత్వం రూపొందించిన ఆక్వా కల్చర్ యాప్‌లో తమ చెరువుల వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ రాయితీలు రైతులు పొందాలంటే ఏపీఎస్ఏడీ యాక్ట్ 2020 చట్టం ద్వారా గుర్తింపు పొందిన చెరువులకు మాత్రమే అందనున్నాయి.

- సచివాలయాల్లో ఆన్‌లైన్ నమోదు
- ఆక్వాజోన్, నాన్ ఆక్వా జోన్‌లతో సంబంధం లేదు..
- రైతులకు అవగాహన సదస్సులు

ఉమ్మడి జిల్లాలో ఆక్వా సాగు వివరాలు..

ఏలూరు జిల్లా :
- సాగులోని ఆక్వా చెరువులు 1,56,000 ఎకరాలు
- రిజిస్ట్రేషన్ చేయబడిన చెరువులు : 50 వేల ఎకరాలు
- ఇంకా కావల్సినవి : లక్షా 6వేల ఎకరాలు

పశ్చిమ గోదావరి జిల్లా :
- సాగులోని ఆక్వా చెరువులు 1,38,000 ఎకరాలు
- రిజిస్ట్రేషన్ చేయబడిన చెరువులు 50 వేల ఎకరాలు
- ఇంకా చేయాల్సినవి : 88 వేల ఎకరాలు

నిడమర్రు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): అమరావతిలో ఈనెల 23వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో చంద్రబాబు ఆక్వా రంగంపై చర్చించారు. ఒడిదుడుకులకు లోన వుతున్న ఆక్వా రంగం సుస్థిరత కోసం, నిర్ధిష్ట సమాచారం కోసం ప్రభుత్వం ప్రత్యేక ప్రణా ళికతో ముందుకెళ్లనున్నట్టు తెలిపారు. దీనికోసం ఆక్వా జోన్, నాన్ ఆక్వా జోన్‌లలో సాగు చేస్తున్న ప్రతి చెరువు ప్రభుత్వ గుర్తింపు పొందాలని, దీనికోసం నెల రోజులు సమయం తీసుకొని రైతులకు అవ గాహన కల్పించి చెరువుల రిజిస్ట్రేషన్లు నమోదు చేయించాలని ఆదేశించారు. సీఎం ఆదేశాలననుసరించి కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆక్వా రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆక్వా రైతులు ప్రతి రైతు తమ చెరువుకు గుర్తింపు రిజిస్ట్రేషన్ తప్పని సరిగా చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ద్వారా విద్యుత్ సబ్సిడీ పొందడానికి (యూనిట్ రూ.1.50) ఈ గుర్తింపు ఉండాలన్నారు. ప్రతి సచివాలయంలో మత్స్య సిబ్బందితో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ చేప డుతున్నామని, రైతులు ఈ అవకాశం సద్వినియో గించుకుని ప్రభుత్వ రాయితీలు పొందాలన్నారు.

ఆక్వా రంగం అభివృద్ధికి దోహదం

ప్రభుత్వం ఆక్వా రంగాన్ని ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో సాగుచేస్తున్న ప్రతి చెరువును రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించింది. దీనివల్ల వాస్తవంగా ఎన్ని ఎకరాలు సాగులో ఉందో అంచనా వస్తుంది. రాబోయే కాలంలో ఆక్వా రంగంలో ప్రభుత్వం ఇచ్చే విద్యుత్ మొదలైన సబ్సిడీలు పొందడం కోసం రిజిస్ట్రేషన్లు తప్పనిసరిగా చేసుకోవాలి. ఆక్వా రంగం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం నడుం బిగించడం శుభపరిణామం.
- సంకు నాగేశు, ఆక్వా రైతు, బువ్వనపల్లి



రిజిస్ట్రేషన్ల కోసం..

ఆక్వా చెరువుల రైతులు తమ చెరువులకు సంబంధించి రైతు పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్, పొలం అడంగళ్ కాపీ - 1బి కాపీ, రైతు ఆధార్ కార్డు, రూ 10 స్టాంప్ పేపర్‌తో కూడిన అఫిడవిట్, ఎకరాకు రూ.వెయ్యి రుసుము, చెరువుకు సంబంధించి ఆటోకాడ్ మ్యాప్ (దీనిని ఫిషరీస్ సిబ్బంది జతపరుస్తారు)తో ఆన్‌లైన్ యాప్‌లో వివరాలు అప్‌లోడ్ చేసిన వెంటనే అప్లికేషన్ జెనరేట్ అవుతుంది. దీనిని డౌన్‌లోడ్ చేసుకొని రైతు సంతకం చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. వారం రోజుల లోపు రిజిస్ట్రేషన్ నెంబర్ ఇస్తారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వా డెవలప్‌మెంట్ బోర్డు సర్టిఫికెట్ (ఏపీ ఎస్ఏడీ యాక్ట్- 2020) ఉన్నవారికి రిజిస్ట్రేషన్ (మిగతా 6వ పేజీలో)

జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన



జీఎస్టీ శ్లాబ్‌ల తగ్గింపుపై బ్యానర్‌తో వివరిస్తున్న వాణిజ్య పన్నుల అసిస్టెంట్ కమిషనర్ బి. శ్రీనివాస్

ఏలూరు,సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కేంద్రం చేపట్టిన జీఎస్టీ సంస్కరణలతో అటు వ్యాపారులకు, ఇటు విని యోగదారులకు కలిగే ప్రయోజనాలపై ఏలూరు వాణిజ్య పన్నులశాఖ-2 సర్కిల్ కార్యాలయం పరిధిలో వన్‌టౌన్ పెరుగుచెట్టు సెంటర్ వద్ద గురువారం అవగాహన కార్య క్రమం నిర్వహించారు. ఆ శాఖ అసిస్టెంట్ కమిషనర్ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ జీఎస్టీలో తీసుకొచ్చిన శ్లాబ్స్ మార్పులు, నూతన విధానాన్ని ప్రజలందరూ వినియోగించుకునేలా వ్యాపారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 25 నుంచి అక్టోబరు 19 వరకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిచనున్నట్టు వివరించారు.జీఎస్టీ అధికారి కె.చిట్టిబాబు, జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జాయింట్ సెక్రటరీ జి.జానుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీకి షాక్

- పెంటపాడు ఎంపీపీపై అవిశ్వాసం
- పావులు కదిపిన జనసేన.. టీడీపీ సంఘీభావం
- ఆర్డీవోకు 14 మంది ఎంపీటీసీలు నోటీసు.. నెల రోజుల్లో ఎన్నిక

(భీమవరం/పెంటపాడు-ఆంధ్రజ్యోతి)



ఆర్డీవో ఖతీబ్‌కౌసర్‌బనోకు నోటీసు అందజేస్తున్న ఎంపీటీసీ సభ్యులు, నాయకులు

తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో వైసీపీ కి ఎదురుదెబ్బ తగిలింది. పెంటపాడు ఎంపీ పీ దాసరి హైమావతిపై టీడీపీ, జనసేనతో పాటు వైసీపీకి చెందిన ఓ సభ్యుడు కలిపి మొత్తం 14 మంది ఎంపీటీసీ సభ్యులు అవి శ్వాస తీర్మానంపై సంతకాలు చేసి ఆర్డీవోకు నోటీసు అందజేశారు. 19 ఎంపీటీసీ స్థానాల కు గాను గత ఎన్నికల్లో వైసీపీ తరఫున 15 మంది, టీడీపీ తరఫున ఇద్దరు, జనసేన మేండేట్‌పై ఇద్దరు విజయం సాధించారు. వీరిలో రావిపాడుకు చెందిన జనసేన అభ్యర్థి ఎన్నికల ముందే వైసీపీలో చేరి ఆ పార్టీ అభ్యర్థికి మద్దతు తెలిపి.. ప్రచారం కూడా చేశారు. నామినేషన్ ఉపసంహరించుకునే అవకాశం లేకపోవడంతో వైసీపీలో చేరినప్ప టికి జనసేన అభ్యర్థిగా పోటీలో ఉండడంతో అక్కడి ఓటర్లు జనసేనపై అభిమానంతో గాజు గ్లాసు గుర్తుపై ఓట్లు వేసి మరీ గెలిపించారు. ఇది రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించింది. ఆయన జనసేన తరఫున నెగ్గినప్పటికి వైసీపీలోనే కొనసాగారు.

ఎంపీపీ పదవి ఆశలు కల్పిస్తూ..

బీసీ జనరల్ కేటగిరికి రిజర్వు (మిగతా 6వ పేజీలో)



నీటమునిగిన కుక్కునూరు-దాచారం మధ్య గుండేటివాగు లోలెవల్ కాజ్‌వే

మళ్లీ పెరుగుతున్న గోదావరి

కుక్కునూరు/పోలవరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గోదావరి నీటిమట్టం మరలా పెరుగుతోంది. భద్రాచలం వద్ద బుధవారం 34 అడుగుల నీటిమట్టం ఉండగా గురువారం సాయంత్రానికి 37 అడుగులకు చేరుకుంది. అల్పపీడన ప్రభావంతో పాటు తెలంగాణలోని ప్రాజెక్టుల నుంచి నీరు వదులుతుండడంతో గోదావరి నీటిమట్టం పెరిగింది. చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు, గోదావరి తీరం వైపు వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లే రైతులు జాగ్రత్తలు వహించాలని తహసీల్దార్ రమేశ్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం గురువారం నాటికి పెరిగింది. పట్టిసీమ వద్ద వరద ఉధృతి పెరిగింది. ఎగువ కాఫర్ డ్యాం బ్యాక్ వాటర్ ప్రభావంతో అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా గొందూరు గండిపోశమ్మ ఆలయం వద్దకు వరద జలాలు ప్రవహిస్తున్నాయి.

కొనసాగుతున్న వర్షాలు

ఏలూరుసిటీ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి):ఉత్తర మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా జిల్లాలో గురువారం పలుచోట్ల విస్తారంగా వర్షాలు కురిశాయి. గురువారం బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడుతుందని, ఈ కారణంగా ఈనెల 27వ తేదీ వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతోంది. గత 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా పెదవేగి మండలంలో 34.6 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సరాసరి వర్షపాతం 13.7 మి.మీగా నమోదైంది. భీమడోలు 31.6, ముసునూరు 31.4, చాట్రాయి 30.8, ఆగిరిపల్లి 24.8, జీలుగుమిల్లి 20, ఉంగుటూరు 19.8, టి.నరసాపురం 19.2, మండవల్లి 17.8, నూజివీడు 16, పెదపాడు 15.4, ద్వారకాతిరుమల 14.6, నిడమర్రు 14, ముదినేపల్లి 14, కలిదిండి 10.2, ఏలూరు రూరల్ 9.6, ఏలూరు అర్బన్ 9.2, కామవరపుకోట 8.4, దెందులూరు 7, లింగపాలెం 5.2, బుట్టాయిగూడెం 4.8, జంగారెడ్డిగూడెం 3.6, కొయ్యలగూడెం 2.8, చింతలపూడి 2.4 మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి.

ఆయుధ ఫ్యాక్టరీకి బలవంతపు భూసేకరణ తగదు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

లోపలి పేజీలో..

తిన్నదానికి బిల్లు కట్టమన్నందుకు..
లారీ ఎక్కించి చంపేశాడు!

- మద్యం మత్తులో లారీ డ్రైవర్ ఘాతుకం
- దాబా యజమాని సహా మరో వ్యక్తి మృతి
- శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలంలో ఘటన


అయూబ్


దండాసి

కంచిలి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిన్నదానికి బిల్లు కట్టమన్నందుకు ఓ డ్రైవర్ తన లారీని పైకి ఎక్కించి ఇద్దరిని చంపేశాడు! ఈ దారుణ ఘటన శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం జలంత్రకోట సమీపంలోని దాబా హోటల్ వద్ద బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. కంచిలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఝార్ఖండ్‌కు చెందిన లారీ డ్రైవర్ ఇబ్రార్ ఖాన్ బుధవారం రాత్రి భోజనం చేసేందుకు దాబా హోటల్‌కు వచ్చాడు. అర్ధరాత్రి 12 గంటలకు భోజనం చేసి బిల్లు ఇవ్వకుండా వెళ్లిపోతుండగా.. దాబా యజమాని ఆయూబ్ (55) అడ్డుకున్నారు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అప్పటికే డ్రైవరు మద్యం మత్తులో ఉన్నాడు. ఆ తర్వాత లారీ ఎక్కి నడుపుకుని వెళ్తుండగా.. ఆపేందుకు అయూబ్ ప్రయత్నించారు. అయితే డ్రైవర్ వాహనాన్ని మీదుగా నడిపించడంతో అయూబ్ అక్కడికక్కడే చనిపోయారు. ఇది గమనించిన మధుపురం గ్రామానికి చెందిన డొక్కరి దండాసి (65) లారీని ఆపేందుకు ప్రయత్నించే క్రమంలో దాని కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. అతడిని సోంపేట ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారు. అక్కడున్న వారు లారీని వెంబడించి బురగాం సమీపంలో పట్టుకున్నారు. పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకు కేసు నమోదు చేశారు.

జల, థర్మల్ విద్యుదుత్పత్తికి ప్రాధాన్యం

- జెన్కో ట్రాన్స్‌కో అధికారులతో సీఎస్ సమీక్ష

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాను సమర్థవంతంగా నిర్వహించేందుకు జల, థర్మల్ విద్యుత్ ఉత్పత్తికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అధికారులను కోరారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా పరిస్థితిపై ఆయన గురువారం సచివాలయంలో ట్రాన్స్‌కో, జెన్కో యాజమాన్యాలతో సమీక్ష నిర్వహించారు. వాతావరణ మార్పుల కారణంగా సౌర, పవన విద్యుత్ ఉత్పత్తిపై ఎక్కువ ఆధారపడకూడదని, వాటికి ప్రత్యామ్నాయంగా జల, థర్మల్ విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించాలని సూచించారు. ఈ ఏడాది జూలై నుంచి సగటున రోజుకి 15.5 మిలియన్ యూనిట్ల జల విద్యుదుత్పత్తి జరుగుతోందని, విద్యుత్ డిమాండ్‌ను అందుకోవడంలో ముఖ్య పాత్ర పోషిస్తుందని తెలిపారు. అక్టోబరు నెలలో పండుగలు, వ్యవసాయానికి అనువైన కాలం కావడంతో, విద్యుత్ డిమాండ్‌ను అందుకోవడానికి సంసిద్ధంగా ఉండాలని సీఎస్ కోరారు. వినియోగదారులకు 24/7 నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. సమావేశంలో జెన్కో ఎండీ నాగలక్ష్మి, ట్రాన్స్‌కో ఇన్‌చార్జి జేఎండీ పృథ్వీతేజతో పాటు ట్రాన్స్‌కో డైరెక్టర్లు ఏకేవీ భాస్కర్, జేవీరావు, ఎన్‌వీ రమణమూర్తి, జెన్కో డైరెక్టర్లు సుజయ్‌కుమార్, అశోక్‌కుమార్ రెడ్డి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సభలో 'సినీ' రగడ

కామినేని వ్యాఖ్యలకు బాలకృష్ణ కౌంటర్

జగన్‌పై ధ్వజం... చిరంజీవి ప్రస్తావన

బాలయ్య మాటలపై చిరు తీవ్ర స్పందన

అమరావతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శాసన సభ వేదికగా 'సినీ' రగడ రాజుకుంది. బీజేపీ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలపై టీడీపీ ఎమ్మెల్యే, నటుడు బాలకృష్ణ తీవ్రంగా స్పందించారు. దీనికి ప్రతిస్పందనగా చిరంజీవి సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. జగన్ సీఎంగా ఉండగా సినీ ప్రముఖులను అవమానించారని.. ఆయన వైఖరికి ఇదొక ఉదాహరణ అని కామినేని శ్రీనివాస్ గురువారం సభలో పేర్కొన్నారు. దీనిపై వారి వ్యాఖ్యలు, స్పందన, ప్రతిస్పందనలు ఇవి...

చిరంజీవి గట్టిగా అడిగితే...: కామినేని



'జగన్మోహన్‌రెడ్డిది ఎంత సైకో మనస్తత్వమంటే.. చిరంజీవిని, ఆయన భార్య సురేఖను ఒకసారి రమ్మంటే వెళ్లినప్పుడు కారు పోర్టికోలోకి వెళ్లగానే జగన్ దంపతులు వచ్చి లోపలకు తీసుకెళ్లారు. తర్వాత సినిమా వాళ్ల సమస్యలపై చర్చించాలని అడిగితే ఆయనే (జగన్) జాబితా పంపారు. ఆ జాబితాలో బాలకృష్ణ, ఇతరులెవరూ లేరు. రాజకీయాలతో సంబంధం లేకుండా ఉంటున్న ప్రభాస్, మహేశ్, రాజమౌళిని రమ్మన్నారు.. వాళ్లు రాబోమన్నా చిరంజీవి గారే రమ్మని అడగడంతో మొహమాటంతో వస్తే.. ఫస్ట్ షాక్. గేటు దగ్గరే కార్లు ఆపేశారు. అందరినీ కార్లు దిగి రమ్మన్నారు. అదేంటనుకుని కార్లు దిగి లోపలకు వెళ్లారు. లోపల సెకండ్ షాక్. ఇంత పెద్దవారిని పిలిచి అక్కడ పోసాని కృష్ణమురళి లాంటి వారిని కూర్చోబెట్టారు. తర్వాత మూడో షాక్. సీఎం గారు మిమ్మల్ని కలవట్లేదు.. సినిమాటోగ్రఫీ మంత్రి వచ్చి మాట్లాడతారని అన్నారు అప్పుడు చిరంజీవి గారు కొద్దిగా గట్టిగానే.. అదేంటండి.. మీరు పిలిచారని నేను వీరందరినీ తీసుకొస్తే ఆయన రానంటారా.. అని అడిగారు. అప్పుడు జగన్ వచ్చారు. మీరొక తండ్రిలా సినిమా పరిశ్రమను జాగ్రత్తగా చూసుకోండని చిరంజీవి మంచిఉద్దేశంతో రిక్వెస్ట్ చేస్తే.. ఆ వీడియో బయటకు రిలీజ్ చేశారు. ఎంత అవమానం? శాడిస్ట్ మెంటాలిటీకి ఇంతకన్నా ఉదాహరణ ఏమి కావాలి?'

గట్టిగా ఎవరడిగారు: బాలకృష్ణ



'అప్పుడు ఇండస్ట్రీ వాళ్లందరూ సైకో గాడిని కలవడానికి వెళ్లినప్పుడు చిరంజీవి గారు గట్టిగా అడిగితే అప్పుడు ఈయన (జగన్) వచ్చాడు అన్నది అబద్ధం. అక్కడ గట్టిగా ఎవ్వడూ అడగలేదు.. సినిమాటోగ్రఫీ మంత్రిని కలవమన్నారు.. ఆ వీడియో పెట్టడం, అవమానించడం నిజం. ఆయన (చిరు) ఏదో పెద్దగా చెబితే ఈయన (జగన్) దిగొచ్చాడంటా.. మొన్న కూడా నాకు ఇన్విటేషన్ వచ్చింది. ఇక్కడ ఫిల్మ్ డెవలప్మెంట్ జాబితా తయారు చేయమని! అందులో నాది తొమ్మిదో పేరు! మంత్రి కందుల దుర్గేశ్ గారిని అడిగా.. ఎవడు వాడు వేసిందని! మర్యాద ఇవ్వడం మానవత్వం. (కామినేని వైపు చూస్తూ..) అదేదో గట్టిగా.. ఎవడడిగాడు? గట్టిగా అడిగితే పంపించారా లోపలికి! ఆ రోజు గట్టిగా అడిగిన వారెవరూ లేరు. మీరు తెలీకుండా మాట్లాడుతున్నారు. అయితే ఆయన(చిరంజీవి)కు అవమానం జరిగింది వాస్తవమే. (స్పీకర్ వైపు చూస్తూ..) సారీ.. వివరణ ఇవ్వడమే నా ఉద్దేశం!'

బాలకృష్ణ అందుబాటులో లేరు: చిరంజీవి



'ఏపీలో జగన్ ప్రభుత్వం ఉన్నప్పుడు తెలుగు చిత్రపరిశ్రమలోని కొందరు నిర్మాతలు, దర్శకులు, ఫిల్మ్ చాంబర్ ప్రతినిధులు నా దగ్గరకు వచ్చి, నిర్మాణ వ్యయం పెరుగుతున్న దృష్ట్యా టికెట్ల ధరల పెంపుదల గురించి ప్రభుత్వంతో మాట్లాడమని నన్ను కోరారు. వారిలో దర్శకులు రాజమౌళి, కొరటాల శివ, త్రివిక్రమ్ శ్రీనివాస్, హీరోలు మహేశ్, ఎన్టీఆర్, నిర్మాత డీవీవీ దానయ్య తదితరులు ఉన్నారు. వారి సూచనల మేరకు అప్పటి సినిమాటోగ్రఫీ మంత్రి పేర్ని నానితో ఫోన్‌లో మాట్లాడాను. సీఎంతో చర్చించి చెబుతానని ఆయన చెప్పారు. ఆ తర్వాత మంత్రి నాకు ఫోను చేసి... జగన్ వన్ టు వన్ కలుస్తారని చెప్పి, లంచ్‌కి ఆహ్వానించారు. నేను సీఎం నివాసానికి వెళ్లగా ఆయన నన్ను సాదరంగా ఆహ్వానించారు. జగన్‌కు సినీ పరిశ్రమ ఇబ్బందుల్ని వివరించాను. సమయం ఇస్తే అందరం కలిసి వస్తామని తెలిపాను. కొన్ని రోజుల తర్వాత మంత్రి పేర్ని నాని ఫోన్ చేసి కొవిడ్ రెండో దశ కొనసాగుతున్నందు వల్ల ఐదుగురు మాత్రమే వస్తే బాగుంటుందని చెప్పారు. నేనప్పుడు ఓ పది మందిమి వస్తామని చెబితే సరేనన్నారు. ఆ సమయంలో బాలకృష్ణను ఫోన్ ద్వారా సంప్రదించడానికి ప్రయత్నించాను. ఆయన అందుబాటులోకి రాలేదు. బాలకృష్ణను కలవమని జెమిని కిరణ్‌ను పంపించాను. ఆయన మూడు సార్లు ప్రయత్నించినా బాలకృష్ణను కలవలేకపోయారు. దాంతో నేను ఓ విమానం ఏర్పాటు చేసి ఆర్. నారాయణమూర్తితో సహా మరికొందరితో వెళ్లి సీఎంను కలిశాం. సినీ పరిశ్రమ ఇబ్బందుల్ని వివరించి, ప్రభుత్వ సహకారం కోరాను. నేను చొరవ తీసుకోవడం వల్లే అప్పుడు ప్రభుత్వం టికెట్ ధరల పెంపునకు అంగీకరించింది. ఆ నిర్ణయం వల్లే 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణ నటించిన 'వీరసింహా రెడ్డి' వంటి సినిమాలకు టికెట్ రేట్లు పెంచడానికి కారణమైంది. నేను సీఎంతోనైనా, సామాన్యుడితో అయినా నా సహజ ధోరణిలోనే మాట్లాడుతాను.'

పత్తి క్వింటా రూ.8,110

- వచ్చే నెల నుంచి సీసీఐ ద్వారా కొనుగోళ్లు
- మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2025-26 సీజన్‌లో గుర్తించిన మార్కెట్ యార్డులు, జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ పత్తి కొనుగోలుకు ప్రభుత్వం గురువారం మార్గదర్శకాలు జారీ చేసింది. రాష్ట్రంలో ఈ ఏడాది 4.02 లక్షల హెక్టార్లలో పత్తి పండించగా, 7.12 లక్షల టన్నుల పత్తి ఉత్పత్తి అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. సీఎం యాప్ ద్వారా కనీస మద్దతు ధరకు వచ్చే నెల నుంచి పత్తి కొనుగోలును సీసీఐ ప్రారంభిస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. పొడవు పింజ పత్తి క్వింటా రూ.8,110, మధ్యస్థ పింజ పత్తి క్వింటా రూ.7,710 చొప్పున కొననున్నట్లు పేర్కొంది. సీసీఐ కొత్త నిబంధనల మేరకు ఎంపిక చేసిన మార్కెట్ యార్డులతో పాటు నోటిఫైడ్ జిన్నింగ్ మిల్లుల్లో పత్తి సేకరణకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. ఆధార్ ఆధారిత ఈ-పంట డేటా ప్రకారం పత్తి రైతులను గ్రామ వ్యవసాయ సహాయకులు గుర్తించి, రైతు సేవా కేంద్రంలో నమోదు చేయనున్నారు. కాపాస్ కిసాన్ యాప్‌తో డేటా అనుసంధానం చేసి, స్లాట్ బుకింగ్ విధానం అమలు చేయనున్నారు. దీనిపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. స్లాట్ బుకింగ్ నేపథ్యంలో మండలాల వారీగా పంట దిగుబడి, కోత సమయాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. యార్డులు, మిల్లుల్లో పత్తి నిల్వలకు బీమా ఉండాలని నిర్దేశించింది. ప్లాస్టిక్, గన్నీ బ్యాగులను నివారించేందుకు రైతులు లూజు పత్తిని కొనుగోలు కేంద్రాలకు తేవాలని సూచించింది. పత్తి రైతుల కుటుంబ సభ్యులను గుర్తించేందుకు రేషన్‌కార్డులోని డేటాను సీఎంయాప్‌కు అనుసంధానం చేయాలని పౌర సరఫరాలశాఖను ఆదేశించింది. రైతుల ఆధార్ లింక్డ్ బ్యాంక్ అకౌంట్‌కు సీసీఐ నగదు చెల్లింపులు జరపాలని నిర్దేశించింది. పత్తి అమ్మకం కోసం వివరాల నమోదు సమయంలో ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం ఫొటో కాపీలను రైతులు తీసుకు రావాలని స్పష్టం చేసింది. సాగు విస్తీర్ణం, దిగుబడి, పత్తితీతల మేరకు మండలాల వారీగా అమ్మకానికి రైతులను అనుమతించనున్నారు. పత్తి నాణ్యతాప్రమాణాలను రైతులకు వివరించాలని, అగ్ని నిరోధక, తేమ శాతం గుర్తింపు పరికరాలు, టార్పాలిన్లు, ఎలక్ట్రానిక్ తూనికలు, సీసీ కెమేరాలు మార్కెట్ యార్డుల్లో ఏర్పాటు చేయాలని మార్కెటింగ్‌శాఖను ఆదేశించింది. జిన్నింగ్ మిల్లుల్లో సీసీ కెమేరాల ఏర్పాటుపై హైకోర్టు ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకోవాలని సీసీఐకి సూచించింది. పత్తి రవాణా వివరాలూ యాప్‌లో నమోదు చేసి, రవాణాదారులకు చెల్లింపులు జరపాలని పేర్కొంది. జిల్లా స్థాయిలో పత్తి కొనుగోలు కార్యకలాపాల పర్యవేక్షణకు జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన కమిటీలు ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

రైతు సమస్యలపై నేడు సీఎంకు షర్మిల వినతిపత్రం

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రైతు సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలసి వినతిపత్రం అందజేస్తానని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలిపారు. గురువారం ఈ మేరకు ఒక ప్రకటనను ఆమె విడుదల చేశారు. శుక్రవారం మధ్యాహ్నం విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో 'రైతన్నకు అండగా కాంగ్రెస్' కార్యక్రమాన్ని చేపడతామన్నారు. అన్నదాతల ఆక్రందనలపై కూటమి ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యల గురించి కాంగ్రెస్ నేతలతో చర్చించాక .. సీఎం చంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చేందుకు వెళతామని తెలిపారు.

వరద జలాలపై మాకే సంపూర్ణ హక్కులు

- కృష్ణా ట్రైబ్యునల్ ముందు ఏపీ స్పష్టీకరణ
- వచ్చే నెల 29, 30, 31 తేదీల్లో కొనసాగనున్న వాదనలు

అమరావతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదీ జలాల వివాద ట్రైబ్యునల్ కేటాయించిన నికర జలాలతో పాటు వరద జలాలపైనా దిగువ రాష్ట్రంగా తమకే సంపూర్ణ హక్కులు ఉంటాయని ఆంధ్రప్రదేశ్ స్పష్టంచేసింది. గురువారం బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్-2 ముందు రాష్ట్రప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా వాదనలు ప్రారంభించారు. ఎగువన ఉన్న తెలంగాణ నుంచి దిగువన ఉన్న తమ ప్రాజెక్టుల్లోకి కృష్ణా జలాలు వచ్చేశాక.. వాటిపై పూర్తి హక్కు తమకే ఉంటుందన్నారు. తమ భూభాగంలోకి వచ్చిన జలాలపై తెలంగాణకు ఎలాంటి హక్కులూ ఉండబోవని తెలిపారు. సోమ, మంగళ, బుధవారాల్లో తెలంగాణ వాదనలు వినిపించగా.. గురువారం ఏపీ వాదనలు ప్రారంభమయ్యాయి. తదుపరి విచారణ వచ్చే నెలాఖరుకు వాయిదాపడింది. అక్టోబరు 29, 30, 31 తేదీల్లో ఏపీ వాదనలు కొనసాగుతాయని ట్రైబ్యునల్ పేర్కొంది. కాగా.. ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన కృష్ణా జలాల్లో తమకు 70% వాటా ఇవ్వాలని తెలంగాణ డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే.



ముగిసిన 'జల ప్రహార్' విన్యాసాలు

భారత ఆర్మీతో కలిసి నౌకాదళం ఏడాదికి రెండుసార్లు నిర్వహించే 'జల ప్రహార్' విన్యాసాలు విశాఖలో బుధవారం ముగిశాయి. వీటిని సముద్రంలోను, తీర ప్రాంతంలోనూ నిర్వహించారు. ఇందులో ఐఎన్ఎస్ ఘరియల్ పాల్గొందని నేవీ వర్గాలు తెలిపాయి.

\- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

ఇక 'రెవెన్యూ' కష్టాలకు చెల్లు!

- వచ్చే నెలంతా ప్రణాళికా శాఖ ఇంటింటి సర్వే
- ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు నిక్షిప్తం
- నవంబరు నుంచి ఆర్టీజీఎస్‌కు అందజేత
- వాట్సప్ గవర్నెన్స్ నుంచి ప్రజలు నేరుగా పత్రాలు డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం

అమరావతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆదాయ, నివాస, కుల, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాల విషయంలో రెవెన్యూ శాఖ చుక్కలు చూపిస్తోందని.. ప్రతి వారం రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీఎస్) నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణలో తేలింది. ప్రజలను ఇబ్బందులకు గురి చేయడంలో రెవెన్యూ, పోలీసు శాఖలు తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. ప్రధానంగా రెవెన్యూ శాఖలో ప్రతి సర్టిఫికెట్‌కు లంచం ఇస్తేనే పని చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి. వాట్సప్ గవర్నెన్స్ అమల్లోకి వచ్చాక మండల తహసీల్దారు కార్యాలయాలకు లబ్ధిదారులు, దరఖాస్తుదారులను రప్పించవద్దంటూ ఇటీవల జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ శాఖను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. అయినా కూడా రెవెన్యూ శాఖలో మార్పు రాలేదు. వారాంతపు సమీక్షా వివరాలను ఆర్టీజీఎస్, ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. కుటుంబానికి సంబంధించిన సమస్త సమాచారం ఆర్టీజీఎస్ వద్ద ఉన్నందున వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ చేయాలని సీఎం ఆదేశించారు. అదేవిధంగా పుట్టుకతో వచ్చిన కులం మధ్యలో మారిపోదు కదా అని సీఎం పేర్కొన్నారు. ఆదాయానికీ ఇదే విధానం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పత్రాలను నేరుగా వాట్సప్ గవర్నెన్స్ ద్వారా జారీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే ఇంటింటికీ వెళ్లి మౌఖికంగా సర్వే నిర్వహించిన ప్రణాళికా శాఖ అక్టోబరులో మరోసారి సర్వేకు సిద్ధమవుతోంది. నెల రోజుల పాటు ఇంటింటి సర్వే చేసి ప్రధానమైన ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలను నిక్షిప్తం చేయనుంది. నవంబరు నుంచి వాటిని ఆర్టీజీఎస్‌కు అందజేస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల డేటాను క్రోడీకరించుకుని వారికి అవసరమైనప్పుడు ధ్రువీకరణ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయాన్ని వాట్సప్ గవర్నెన్స్ కల్పిస్తుందని 'ఆంధ్రజ్యోతి'కి కాటంనేని భాస్కర్ వివరించారు.

వేలకోట్లు వెచ్చిస్తున్నా
ఉద్దేశం నెరవేరట్లేదు!

- కేజీబీవీల్లో శాశ్వత సిబ్బందిని నియమించకపోవడంపై హైకోర్టు ఆగ్రహం
- అర్హులైన బోధన సిబ్బంది లేకుండా నాణ్యమైన విద్య ఎలా సాధ్యమని ప్రశ్న
- 14న కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలని కేంద్ర మానవ వనరుల కార్యదర్శికి ఆదేశం
- రాష్ట్ర పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శికి కూడా

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 21 ఏళ్లుగా ఏటా వేల కోట్లు ఖర్చు చేస్తున్నా కేజీబీవీల ఏర్పాటు ఉద్దేశం నెరవేరట్లేదని హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. సర్వశిక్షా అభియాన్ పథకం కింద ఏర్పాటు చేసిన కేజీబీవీలలో శాశ్వత ప్రాతిపదికన అర్హులైన బోధనా సిబ్బందిని నియమించకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించింది. శాశ్వత సిబ్బందిని ఏర్పాటు చేయకపోవడాన్ని తీవ్రంగా ఆక్షేపించింది. ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్, మైనార్టీ, అణగారినవర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో 2004లో ఈ పథకాన్ని తీసుకొచ్చారని గుర్తుచేసింది. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పాలసీలో శాశ్వత ప్రాతిపదికన సిబ్బంది నియామకం గురించి ప్రస్తావించారని, మరోవైపు ప్రతి ఏడాది కాంట్రాక్ట్ పద్ధతిలో సిబ్బందిని నియమించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు చేశారని పేర్కొంది. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో స్థిరమైన వైఖరి కనిపించడంలేదంది. ఒకరిపై ఒకరు నెపం వేసుకుంటున్నారని తెలిపింది. తగినన్ని అవకాశాలు ఇచ్చినప్పటికీ సరైన వివరాలు అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయంది. వివరణ ఇచ్చేందుకు అక్టోబరు 14న తమ ముందు హాజరుకావాలని కేంద్ర మానవవనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ కార్యదర్శిని, రాష్ట్ర పాఠశాల విద్యశాఖ ముఖ్యకార్యదర్శిని ఆదేశించింది. విచారణను వచ్చేనెల 14వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టుదేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మతో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు(కేజీబీవీ)ల్లో పనిచేస్తున్న తమను అర్ధంతరంగా తొలగించడాన్ని సవాల్ చేస్తూ పార్ట్‌టైం పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లు(పీజీటీలు) 2023లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన సింగిల్ జడ్జి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు పిటిషనర్లను ఉద్యోగాలలో నుంచి తొలగించడాన్ని తప్పుపట్టారు. వారిని కొనసాగించాలని అధికారులను ఆదేశిస్తూ 2023 డిసెంబరు 5న తీర్పు ఇచ్చారు. ఆ తీర్పును సవాల్ చేస్తూ అధికారులు 2024 జనవరిలో ధర్మాసనం ముందు అప్పీల్ వేశారు. ఈ అప్పీల్ గురువారం మరోసారి విచారణకు వచ్చింది. కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ వాదిస్తూ.. శాశ్వత ప్రాతిపదికన బోధన సిబ్బందిని నియామించుకొనే వెసులుబాటు కేంద్రం రూపొందించిన పాలసీలో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ....బోధన సిబ్బందిని కాంట్రాక్ట్ పద్ధతిలో ఏర్పాటు చేసుకోవాలని కేంద్రం రాష్ట్రానికి సూచనలు చేసిందన్నారు. సర్వశిక్షా అభియాన్‌లో నడిచే విద్యాసంస్థలకు అయ్యే ఖర్చులో 60 శాతాన్ని కేంద్ర ప్రభుత్వం ఇస్తోందని, కేంద్రం చెప్పినట్లు నడుచుకోకుంటే ఆ సొమ్మును విడుదల చేయరని తెలిపారు. ఇరువైపుల వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఈ వ్యవహారంపై వివరణ ఇచ్చేందుకు తమ ముందు హాజరుకావాలని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ కార్యదర్శి, రాష్ట్ర పాఠశాల విద్యశాఖ ముఖ్యకార్యదర్శిలను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

పోరాట ఘట్టాలు ప్రత్యేకాకర్షణగా



మలయాళ దర్శకుడు డాక్టర్ ప్రగబల్ తెరకెక్కిస్తున్న చిత్రం 'జాకీ'. యువన్ కృష్ణ, రిధాన్ కృష్ణన్, అమ్ము అభిరామి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ప్రేమకృష్ణ దాస్, సీ ప్రేమదాస్ నిర్మిస్తున్నారు. మధురైలో సంప్రదాయంగా కొనసాగుతున్న పొట్టేలు పందేల చుట్టూ సాగే ఆసక్తికర కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కుతోంది. చిత్రబృందం గురువారం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా ప్రగబల్ మాట్లాడుతూ 'ఆసక్తికరమైన కథాంశంతో 'జాకీ' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నా. ప్రేక్షకులను థ్రిల్ చేసేలా ఉంటుంది. పోరాట ఘట్టాలు చాలా బావుంటాయి. థ్రిల్లింగ్ అంశాలతో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగే చిత్రం ఇది. పొట్టేలు పందేలు, పాత్రల భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి. రియల్ లొకేషన్లలో సినిమాను చిత్రీకరించాం' అని చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: శక్తి బాలాజీ, సినిమాటోగ్రఫీ: ఉదయ్ కుమార్.

పవన్‌తో సినిమా ఆనందంగా ఉంది

\- సుజీత్



'దాదాపు మూడేళ్ల ప్రయాణం. మొదటి రోజు నుంచి మమ్మల్ని సపోర్ట్ చేస్తూ, మా పక్కనే ఉంటూ మాకు కావాల్సినవన్నీ ఏర్పాటు చేసిన నిర్మాతలు డీవీవీ దానయ్య, కల్యాణ్ గారికి కృతజ్ఞతలు. అలాగే 'ఓజీ' కథకి ఇంతటి భారీతనం రావడానికి కారణమైన పవన్ కల్యాణ్‌కి కృతజ్ఞతలు. నేను ఆయన వీరాభిమానిని. 'జానీ' సినిమా సమయం నుంచి పవన్‌గారిని కలిస్తే చాలు అనుకునేవాడిని. అలాంటిది ఇప్పుడు ఆయనతో సినిమా చేయడం, దానికి బ్లాక్ బస్టర్ టాక్ రావడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు దర్శకుడు సుజీత్. పవన్ కల్యాణ్ కథానాయకుడిగా ఆయన తెరకెక్కించిన 'ఓజీ' సినిమా గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. సంగీత దర్శకుడు తమన్ మాట్లాడుతూ 'విడుదలకు ముందు సినిమా పట్ల చాలా నమ్మకంగా ఉన్నాము. మా నమ్మకం నిజమైంది, విజయం సాధించిన తర్వాత భయం, బాధ్యత పెరిగాయి. 'ఓజీ' సినిమా మాది కాదు. దీన్ని ప్రేక్షకులు తమదిగా భావిస్తున్నారు. ఎక్కడ చూసినా 'ఓజీ' సందడే కనిపిస్తోంది. పవన్ కల్యాణ్ గారికి ఉండే పవర్ అది. 'వకీల్ సాబ్, భీమ్లా నాయక్, బ్రో, ఓజీ' ఇలా వరుసగా పవన్ కల్యాణ్ గారి సినిమాలకు పనిచేసే అవకాశం రావడం చిన్న విషయం కాదు' అని అన్నారు. డీవీవీ దానయ్య మాట్లాడుతూ 'పవన్ కల్యాణ్ గారి అభిమానులకు నచ్చే సినిమా అందించాలనే ఉద్దేశంతో ఎంతో శ్రద్ధతో ఈ సినిమా చేశాం. తమన్, నవీన్ నూలి, రవి చంద్రన్ ముగ్గురూ ఈ సినిమాకు మూడు స్తంభాల్లాంటి వారు. అభిమానుల స్పందన చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది' అని అన్నారు.

ఏఐతో నా ఫొటోలు మార్ఫింగ్ చేస్తున్నారు


- డిల్లీ హైకోర్టులో నాగార్జున పిటిషన్
- వ్యక్తిగత హక్కులను కాపాడుతామన్న న్యాయస్థానం



కొన్ని వెబ్‌సైట్‌లు, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు తన అనుమతి లేకుండా ఫొటోలు, వీడియోలు వాడుతూ దుర్వినియోగం చేస్తున్నాయని, పబ్లిసిటీ, పర్సనాలిటీ హక్కులకు రక్షణ కల్పించాలని కోరుతూ అక్కినేని నాగార్జున డిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. కొందరు తన ఫొటోలను మార్ఫింగ్ చేసి, అసభ్యకరమైన కంటెంట్, లింక్‌లు సృష్టిస్తున్నారని, ఇది తన వ్యక్తిగత ప్రతిష్ఠకు తీవ్ర భంగం కలిగిస్తోందని ఆ పిటీషన్‌లో పేర్కొన్నారు. గురువారం ఆ పిటిషన్ జస్టిస్ తేజస్ కరియా సింగ్ ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. నాగార్జున తరఫున న్యాయవాది ప్రవీణ్ ఆనంద్ వాదనలు వినిపించారు. దీనికి సంబంధించి 14 యూఆర్ఎస్ (యూనిఫాం రిసోర్స్ లొకేటరీ)లు కోర్టుకు సమర్పించారు. జస్టిస్ కరియా స్పందిస్తూ... 'మీ దగ్గర యూఆర్ఎల్ ఉన్నాయి కదా? ఆ లింక్‌లను తొలగించమని వారికే చెప్పవచ్చు కదా?' అని ప్రశ్నించారు. తామిచ్చే ఆదేశాలతో ఎంత కాలం ఇలాంటివి ఆపగలమని వ్యాఖ్యానించారు. అలాగని, తామేమీ చూస్తూ ఊరుకోమని తెలిపారు. ప్రస్తుతం ఏఐ ఇంటర్నెట్‌లో భాగమైన తర్వాత పెద్ద సమస్యగా తయారైందని వ్యాఖ్యానించారు. నాగార్జున వ్యక్తిగత హక్కులకు భంగం కలగకుండా చూస్తామన్నారు. తక్షణమే ఆ లింకులను తొలగించాలని ఆయా యూట్యూబర్లు, కంటెంట్ క్రియేటర్లకు ఆదేశాలు జారీ చేశారు.

\-న్యూఢిల్లీ, ఆంధ్రజ్యోతి

జటాధర తొలి గీతం



సుధీర్ బాబు, సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రధారులుగా వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కిస్తోన్న పాన్ ఇండియా చిత్రం 'జటాధర'. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని ఉమేశ్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్, అరుణ అగర్వాల్, ప్రేరణ అరోరా, శిల్పా సింగ్‌హల్, నిఖిల్ నందా నిర్మిస్తున్నారు. నవంబరు 7న తెలుగు, హిందీ భాషల్లో విడుదలకు సిద్ధమవుతోంది. తాజాగా మేకర్స్ ఈ చిత్రం నుంచి 'ఓం నమఃశివాయ్..' అంటే సాగే తొలి పాట సోల్ ఆఫ్ జటాధర ట్రాక్ ప్రోమోను విడుదల చేశారు. కాగా, ఈ సినిమాలో శిల్పా శిరోద్కర్ కీలక పాత్ర పోషిస్తున్నారు.

ఆసక్తిగా 'గోదారి గట్టుపైన'



సుమంత్ ప్రభాస్, నిధి ప్రదీప్, జగపతి బాబు ప్రధాన పాత్రధారులుగా నూతన దర్శకుడు సుభాష్ చంద్ర దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'గోదారి గట్టుపైన'. రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ పతాకంపై అభినవ్ రావు నిర్మిస్తున్నారు. తాజాగా యూనిట్ ఈ చిత్రం నుంచి ఫస్ట్ గ్లింప్స్ రిలీజ్ చేసింది. లైట్ హౌస్ పైకి తన ప్రేమికురాలిని తీసుకెళ్లిన హీరో, గోదావరి సముద్రంలో కలసిపోయే అద్భుత దృశ్యం చూపించే సన్నివేశంతో వీడియో ప్రారంభమవుతుంది. 'మనుషులు కూడా భేదాభిప్రాయాలు లేకుండా ఒకటిగా కలిసిపోతే ఈ మత భేదాలు అనేవి ఉండవు కదా' అని సుమంత్ ప్రభాస్ పలికే సంభాషణలు ఆసక్తిగా ఉన్నాయి. కాగా, నిధి ప్రదీప్ ఈ చిత్రం ద్వారా కథానాయికగా పరిచయం అవుతున్నారు.


అన్నపూర్ణాదేవిగా భీమవరం మావుళ్లమ్మ


పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో విశాలాక్షిదేవి అలంకారంలో పార్వతీదేవి


కాళ్ళకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో సంతానలక్ష్మి అలంకరణ

కాత్యాయనీ.. పాహిమాం !

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు గురువారం అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరణ చేశారు. అన్నపూర్ణాదేవిగా, లలితా త్రిపుర సుందరీ అమ్మవారిగా, కాత్యాయనీ దేవిగా అలంకరించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.


కాత్యాయనీ అలంకరణలో ద్వారకా తిరుమల క్షేత్రదేవత కుంకుళ్లమ్మ , మందలపర్రు ఉమాదేవి, మండపాక యల్లారమ్మ , పెదమల్లం మాచేనమ్మ


ఏలూరు పంపుల చెరువు ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగిస్తున్నా ఏపీ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్ కుమార్ రెడ్డి, కలెక్టర్ వెట్రిసెల్వి

ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించండి

ఏపీ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్ కుమార్‌రెడ్డి

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన నవ సమాజాన్ని నిర్మించడానికి అందరూ కలిసి శ్రమదానం చేయాలని ఏపీ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్ కుమార్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా హెడ్‌వాటర్ వర్క్ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతీరోజు ఒక గంటపాటు ప్రతీ ఒక్కరు శ్రమదానం చేసి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలన్నారు. ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయాలను ఆచరించి ముందడుగు వేయాలన్నారు. ఎక్కడ పరిశుభ్రత ఉంటుందో అక్కడ పండుగ వాతావరణం ఉంటుందన్నారు. అక్టోబర్ 2న క్లాప్ మిత్రలకు విజయవాడలో జరిగే సభలో సన్మానాలు చేసి బహుమతులు అందజేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లా అంతటా మొక్కలు నాటుతామన్నారు. విద్యార్థి దశ నుంచే పర్యావరణం పట్ల అవగాహన కల్పించాలన్నారు. పరిసరాలు శుభ్రం చేసి చెత్తను డస్ట్‌బిన్‌లో వేయాలన్నారు. ఎప్పటి చెత్త అప్పుడు తొలగించాలన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర తీర్చిదిద్దటానికి ప్రతీఒక్కరు ముందుకు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. నగర పాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్, జడ్పీ సీఈవో ఎం.శ్రీహరి, డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి, ఇడా చైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ పార్థసారథి, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కార్పొరేటర్లు పద్మ, ఎం.కేదారేశ్వరి, ఎస్.శ్రీనివాసరావు, లక్ష్మణరావు, మెప్మా సిబ్బంది, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, స్వచ్ఛంధ సేవా సంస్థల ప్రతినిధులు, క్లాప్ మిత్రాలు పాల్గొన్నారు.



ఏలూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ఆయుధ ఫ్యాక్టరీకి బలవంతపు భూసేకరణ తగదు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ఏలూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి):జీలుగుమిల్లిలో ఆయుధ కర్మాగారానికి తమ భూములు ఇవ్వలేమని ఆదివాసీలు తెగేసి చెప్పినా.. అధికారులు మాత్రం ప్రజా ప్రతినిధుల ప్రోత్సాహంతో బలవంతపు భూసేకరణ దిగడం సమంజసం కాదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అభ్యంతరం వ్యక్తం చేశారు. పెసా గ్రామసభల్లో ఇప్పటికే మూడుసార్లు నాలుగు గ్రామాల ప్రజలు సాగు చేసిన భూములు ఇచ్చేది లేదని తీర్మానాలు చేసినా.. అక్కడ భూసేకరణ చేస్తున్నట్లు నోటిఫికేషన్ ఇవ్వడంపై ఆయన మండిపడ్డారు. ఏలూరు సీపీఎం జిల్లా కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.బలరామ్‌తో కలిసి శ్రీనివాసరావు పాత్రికేయుల సమావేశంలో గురువారం మాట్లాడారు. 1,600 ఎకరాల్లో ఆదివాసీలు రెండు పంటలు సాగు చేసుకుంటున్నారని, పంటల పండే భూముల్లో ఆయుధ కర్మాగారంతో యువతకు ఉపాధి కల్పిస్తామని చెబుతున్నారని, ఇప్పటికే రాష్ట్రంలో ఆరు వేల ఎకరాలు పరిశ్రమలకు కేటాయించినా ఉపాధి కల్పించలేదని ఆయన ఎద్దేవా చేశారు. ఆదివాసీలు హక్కుల ఉల్లంఘనకు పాల్పడే అధికారం ఎవరిచ్చారని ఇక్కడ భూసేకరణలో ఎంపీ, ఎమ్మెల్యేలు కలెక్టర్‌పై ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. ఈ భూముల సేకరణకు పీడీ యాక్టు పెడితే సహించేది లేదని, బర్రింకలపాడులో రెండు వేల ఎకరాల రిజర్వ్ ఫారెస్టు భూముల్లో ఏర్పాటు చేయవచ్చునని శ్రీనివాసరావు కోరారు.

ఎర్రకాలువ ఉధృతి


మాధవరం-కంసాలిపాలెం గ్రామాల మధ్య ఎర్రకాలువ ఉధృతి

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం మాధవరం నిడదవోలు మండలం కంసాలిపాలెం మధ్య వరద ఉధృతికి రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వారం క్రితం ఎర్రకాలువ వరదలకు ఇబ్బంది పడ్డ రైతులు ప్రయాణికులకు మళ్లీ ఎర్ర కాలువ వరద ఇబ్బంది పెడుతోంది. వరి పంట చేతికి వస్తున్న సమయంలో వరదలు తమ చేలను ఎక్కడ ముంచుతాయో అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీకి ఎంపికైన నూతన ఉపాధ్యాయులకు గురువారం వెలగపూడిలో ఏర్పాటు చేసిన సభలో ఉద్యోగ నియామకపత్రాలను అందజేశారు. ఉమ్మడి జిల్లాలో జోనల్ పోస్టులతో సహా ఉద్యోగాలకు ఎంపికైన 1231 మందిని ఏలూరులో ఏర్పాటుచేసిన 9 పాఠశాలలు/ సంక్షేమ వసతి గృహాలనుంచి ఉదయం 8 గంటలకు మొత్తం 47 ప్రత్యేక బస్సుల్లో పంపించారు. వెలగపూడిలో సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం ప్రారంభంకాగా, రాత్రి 7 గంటలకు ముగిసింది. ఉమ్మడి జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు సభలో సీటింగ్ ఎరేంజ్‌మెంట్స్ చేయగా, నియామక పత్రాల అందజేత బాధ్యతలను నియోజకవర్గ ఇన్‌చార్జిలకు అప్పగించారు. సంబంధిత ఎమ్మెల్యేలు తమ తమ నియోజకవర్గం నుంచి ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన అభ్యర్థుల వద్దకు శుభాకాంక్షలు తెలిపేలా ఏర్పాట్లు చేశారు. తిరుగు ప్రయాణంలో రాత్రిభోజనం ప్యాకెట్లను సంబంధిత బస్సుల్లోనే వెలగపూడిలో సభ నిర్వాహకులే ఉంచడంతో ఎటువంటి ఇబ్బందులు తలెత్తలేదని డీఈవో కార్యాలయ వర్గాలు తెలిపాయి. కొత్త ఉపాధ్యాయలు కొలువుతీరుతుండటంతో ఉమ్మడి జిల్లాలో ముఖ్యంగా కుక్కునూరు, వేలేరుపాడు మండలాలతో పాటు, మరికొన్ని మండలాల్లో టీచర్ల కొరత పూర్తిగా తీరనుంది. ఉపాధ్యాయ అభ్యర్థులను వెంటబెట్టుకుని వెలగపూడి సభకు వెళ్లినవారిలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల డీఈవోలు వెంకటలక్ష్మమ్మ, నారాయణ, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, సమగ్రశిక్ష రెండు జిల్లాల ఏపీసీలు పంకజ్‌కుమార్, శ్యామ్, డీవైఈవోలు రవీంద్రభారతి, సుధాకర్, ఎంఈవోలు, వైద్యాధికారులు, సిబ్బంది ఉన్నారు.


విజయోత్సాహం : బస్సులో వెలగపూడికి కొత్త టీచర్లు



కొత్త టీచర్ల మెగా జోష్ !

వెలగపూడిలో నియోజకవర్గాల వారీగా ఉద్యోగ నియామక పత్రాలు అందజేత

కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు ఉపాధ్యాయుల కొరత తీరినట్టే

నాసిరకం అల్పాహారం, భోజనం

డీఎస్సీ అభ్యర్థులు, వారివెంట వచ్చిన సహాయకులు బుధవారం సాయంత్రమే ఏలూరులో తమకు కేటాయించిన రిసీవింగ్ సెంటర్లలో రిపోర్టు చేయగా, వారికి అందించిన రాత్రి భోజనం, గురువారం ఉదయం అల్పాహారం నాసిరకంగా ఉన్నట్టు విమర్శలు వచ్చాయి. రుచీ పచీలేని ఆహార పదార్థాలతో పలువురు తీవ్ర అసంతృప్తిచెందగా, మరికొందరు తమకు తెలిసినవారి దగ్గరనుంచి భోజనం తెప్పించుకున్నట్టు సమాచారం. ఉదయం వడ్డించిన ఉప్మా, చట్నీ దారుణంగా ఉన్నాయని తెలిసింది. ఇక గురువారం మధ్యాహ్నభోజనం ప్యాకెట్లను ఓ ఇంజనీరింగ్ కళాశాల వద్ద అందించగా, మొత్తం 47 బస్సులకు గాను ఐదు బస్సుల్లోని అభ్యర్థులకు, వారి సహాయకులకు అందజేయ డానికి ప్యాకెట్లు లేకపోవడంతో ఇక్కట్ల పాలైనట్టు సమాచారం. దీంతో అప్పటికప్పుడు ప్రత్యామ్నాయంగా మళ్లీ ఆహార పొట్లాలను తీసుకువచ్చినట్టు తెలిసింది. కాగా రిసీవింగ్ కేంద్రాలకు కేటాయించిన సుమారు 2400 మంది అభ్యర్థుల్లో ఆయా కేంద్రాల వద్ద రిజిస్టర్ చేయించుకుని, రాత్రి నిద్రించేందుకు సొంత ఏర్పాట్లు చేసుకున్న పలువురు బయటకు వెళ్లిపోయినట్టు సమాచారం. దీంతో బుధవారం రాత్రిభోజనం చేసినవారు సుమారు 40 శాతం మంది మాత్రమే ఉంటారని తెలిసింది. ఆహార ఏర్పాట్ల నిమిత్తం ఒకొక్కరికి రూ.300 చొప్పున కేటాయించినట్టు సమాచారం.




బంగారు భవిష్యత్తు వైపు అడుగులు : ఏలూరు నుంచి వెలగపూడి బయలు దేరుతున్న ఉపాధ్యాయ అభ్యర్థులు.. చెక్ చేసి బస్సు ఎక్కిస్తున్న సిబ్బంది

నేటి నుంచి డిగ్రీ రెండో విడత అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్లు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : డిగ్రీ కళాశాలల్లో రెండో విడత అడ్మిషన్లకు ఈనెల 29వ తేదీ వరకు గడువు ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల జిల్లా నోడల్ ఆఫీసర్ జి.గిరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 26 నుంచి 29 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. వెబ్ ఆప్షన్లు 29 నుంచి అక్టోబరు 1 వరకు ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

ఇసుక తవ్వేస్తున్నారు

శాసన మండలిలో ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్



తణుకు రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్ర జ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లాలోని ఆచంట, పెనుగొండ మండలాల్లోని గ్రామాల్లో ఇసుక తవ్వకాలను నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిషేధం ఉన్నప్పటికీ రోజూ జేసీబీలతో ఇసుకను అక్రమంగా తవ్వేస్తున్నారు. ఆచంట మండలం కరుగోరిమిల్లి, కోడేరు గ్రామాలు, పెనుగొండ మండలంలోని నడిపూడి, సిద్ధాంతం గ్రామాల్లో ఇసుక తవ్వకాలను నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిషేధం విధించినప్పటికీ రోజూ ఎక్స్‌కవేటర్లతో ఇసుకను తవ్వి అక్రమంగా తరలిస్తున్నారు. ఈ సమస్యపై మైనింగ్, పొల్యూషన్ శాఖలు శ్రద్ధ పెట్టాలి. కోస్టల్ రెగ్యులేషన్ జోన్ పరిధిలో వున్న కాలువల్లో ఇసుక తీయడం వల్ల గట్లు బలహీన పడి పరిసర గ్రామాలు వరద ముంపునకు గురయ్యే ప్రమాదం వుంది. ఇక్కడ నుంచి తరలించిన ఇసుకను బాహాటంగా 30 ప్రదేశాలలో నిల్వ చేస్తున్నారు. గురువారం శాసన మండలి ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ సభ దృష్టికి ఈ విషయాలను తీసుకు వచ్చారు.

ఎస్సీ కార్పొరేషన్ జూనియర్ అసిస్టెంట్‌పై చీటింగ్ కేసు నమోదు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి ఆరు లక్షల రూపాయల నగదును స్వాహా చేసిన ఎస్సీ కార్పొరేషన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పరమత పవన్‌కుమార్‌పై గురువారం రాత్రి ఏలూరు త్రిటౌన్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. జిల్లా కలెక్టరేట్ కాంపౌండ్‌లో ఉన్న ఎస్సీ కోపరేటివ్ సంస్థ (ఎస్సీ కార్పొరేషన్)లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పవన్‌కుమార్ ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి చెక్కుల ద్వారా ఆరు లక్షల రూపాయల నగదును అదే సంస్థలో పనిచేసే ఉద్యోగుల అకౌంట్‌లో కొంత కొంత సొమ్ము వేసి తన అకౌంట్‌లో కూడా ఎక్కువ సొమ్ము వేసుకుని డ్రా చేసుకున్నాడు. ఫెస్టివల్ అడ్వాన్స్ సొమ్ములని తోటి ఉద్యోగులకు చెప్పి నమ్మబలికాడు. తాను దరఖాస్తు చేయకుండా ఫెస్టివల్ అడ్వాన్స్ సొమ్ములు ఎలా పడతాయని వారు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళారు. తాను ఎవరికి ఎలాంటి సొమ్ములు వేయలేదని చెప్పి విచారణ చేశారు. పవన్‌కుమార్ చెక్కులను తస్కరించి ఈడీ సంతకాన్ని ఫోర్జరీ చేసి నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లుగా గుర్తించారు. అతనిపై త్రిటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. సీఐ కోటేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు.

క్రైమ్ కార్నర్

ఇద్దరు చిన్నారులకు అస్వస్థత



కామవరపుకోట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కామవరపుకోట యానాది కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఒక విద్యార్థి, అంగన్‌వాడీ చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. కాలనీకి చెందిన మనోజ్(7) సోదరి రేణుకమ్మ (4)తో అంగన్‌వాడీ కేంద్రానికి గురువారం ఉదయం వెళ్లాడు. కేంద్రానికి వెళ్ళిన వెంటనే మనోజ్ వాంతులు చేసుకున్నాడు. వెంటనే అంగన్‌వాడీ వర్కర్, ఆశాలు వారిని ఇంటికి తీసుకువెళ్ళారు. వారి ఇంటికి వెళ్ళిన తరువాత రేణుకమ్మ కూడా వాంతులు చేసుకుంది. దీంతో వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వద్ద వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ఆసుపత్రికి సిఫార్సు చేశారు.కామవరపుకోట మండలంలో ఉండే అంబులెన్సు మరమ్మతులకు వెళ్ళడంతో 108 అంబులెన్సులో ఏలూరు ఆసుపత్రికి తరలించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఆ ఇంటికి వెళ్ళి పరిశీలించగా చిన్నారులు ఇంటి వద్ద చీమలమందు కలిసిన ఆహారాన్ని తీసుకున్నట్టు నిర్ధారణ చేశారు. ఏలూరు ఆసుపత్రిలో చిన్నారులు చికిత్స పొందుతున్నట్టు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వీరకుమారి తెలియచేశారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి


తోట జాన్సీ (ఫైల్)

పాలకొల్లు టౌన్ , సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధి పూలపల్లిలో వివాహిత తోట జాన్సీ (32) అనుమానాస్పద స్థితిలో మరణించినట్టు పట్టణ సీఐ రజనీకుమార్ తెలిపారు. పూలపల్లిలో నివాసం ఉంటున్న తోట జాన్సీ పుట్టినిల్లు వెంప. అత్తవారి ఇల్లు మేడపాడు కాగా కొంతకాలంగా భర్త పెద్దిరాజుతో కలిసి జాన్సీ పూలపల్లిలో నివసిస్తున్నది. భార్యా భర్తలు ఇరువురికి తరచుగా గొడవలు జరుగుతుండేవని తన కుమార్తెను పెద్దిరాజు కొట్టి చంపాడని జాన్సీ తండ్రి ప్రభుదాసు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనుమానాస్పద మృతిగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు సీఐ తెలిపారు.


ఏలూరు ప్రభుత్వాసుపత్రిలోని ఎంసీహెచ్ విభాగం

కుట్లు వేశారంటే అంతే..

ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం

- పేషెంట్ల వద్దకు బంధువుల రావడం వల్లే ఇన్‌ఫెక్షన్ అంటూ అధికారుల కట్టుకథలు
- వైద్య విధాన పరిషత్‌లో ఏనాడూ ఫిర్యాదు లేని ఎంసీహెచ్ విభాగం

బాలింతలను వెంటాడుతున్న సిజేరియన్ల భయం



ఏలూరు క్రైం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు, నర్సులు, సిబ్బంది నిర్లక్ష్యంతో బాలింతలు ప్రాణాపాయ పరిస్థితుల్లోకి వెళ్లిపోతున్నారు. ఎన్నిసార్లు జిల్లా కలెక్టర్ హెచ్చరించినా తమ పద్ధతి ఇంతేనంటూ కొంతమంది వైద్య సిబ్బంది తమ విధులను నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రోగుల ప్రాణాలు గాలిలో కలిసిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గతంలో జిల్లాస్థాయి సమీక్ష సమావేశంలో ఈ సమస్యలు లేవనెత్తడంతో కొంతకాలం పాటు అంతా బాగానే ఉన్నా ఆ తరువాత మళ్లీ యథావిధిగా నిర్లక్ష్య ధోరణిలోనే విధులు నిర్వర్తిస్తున్నారు.

ఏలూరు ప్రభుత్వాసుపత్రి మెడికల్ కాలేజీ టీచింగ్ ఆసుపత్రిగా 2022లో మార్పు చేశారు. అంతకు ముందు వైద్య విధాన పరిషత్‌లో కొనసాగేది. గతంలో ఏలూరు ప్రభుత్వాసుపత్రి జాతీయస్థాయిలో ఉత్తమ వైద్య సేవలు అందించిన ఆసుపత్రిగా రెండు పర్యాయాలు ప్రథమస్థాయి అవార్డును పొందింది. రాష్ట్రస్థాయిలో రెండు పర్యాయాలు అవార్డులు వచ్చాయి.

డీఎంఈ పరిధిలో అస్తవ్యస్తం

డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలోకి ఆసుపత్రి వెళ్లిన తరువాత అస్తవ్యస్తంగా మారిపోయింది. మెడికల్ కళాశాలలో అంతా సూపర్‌స్పెషాలిటీ వైద్యం అందుతుందని మాటల వరకే పరిమితం అయ్యాయి. వచ్చిన ప్రతి కేసును ఇక్కడ చేర్పించుకోకుండా రిఫరల్ చేస్తూనే ఉన్నారు. న్యూరోసర్జన్‌లో ఉన్న వార్డుల్లో పేషెంట్లను చేర్చుకోరు. తల్లీబిడ్డల విభాగంలో దారుణమైన దుస్థితి నెలకొంది. గత ఏడాది నుంచి ఈ విభాగంలో పురుడుపోసుకోవడానికి వచ్చిన గర్భిణులకు సిజేరియన్ జరిగిందంటే కచ్చితంగా వారి కుట్లు వద్ద పస పట్టడం, కుట్లు విడిపోవడం వంటివి జరుగుతూనే ఉంటున్నాయి. మళ్లీ వారిని కొద్దిరోజుల పాటు అక్కడే ఉంచి వైద్య సేవలు అందిస్తున్నారు. ఒక మహిళను మూడు నెలల పాటు ఆసుపత్రిలోనే ఉంచి ఆ కుట్లు మానేవరకు మరో విభాగంలో వైద్య సేవలు అందించారు. ప్రస్తుతం మెడికల్ కాలేజీ హాస్పిటల్ (ఎంసీహెచ్) విభాగంలో గర్భిణులకు సిజేరియన్ జరిగిందంటే వారు కచ్చితంగా ఇబ్బందులు పడతారని ప్రజలు బాహాటంగా చెప్పుకుంటున్నారు. ఎవరైనా ఇదేమిటని ప్రశ్నిస్తే పేషెంట్ల వద్దకు చూడడానికి ప్రజలు విపరీతంగా వస్తున్నారని అందువల్ల ఇన్‌ఫెక్షన్ వస్తుందని తాపీగా సమాధానం చెప్పి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు.

వైద్య విధాన పరిషత్‌లో..

వాస్తవానికి వైద్య విధాన పరిషత్‌లో ఉండగా నెలకు 500 నుంచి 650 కాన్పులను నిర్వహించే వారు. సిజేరియన్లు రోజుకు 8 వరకు చేసే వారు. కానీ ఏ ఒక్కరూ కూడా ఆ రోజుల్లో కుట్ల వద్ద పస పట్టిందనో, కుట్లు ఊడి పోయాయని ఎవరూ ఫిర్యాదులు లేనేలేవు. కానీ ఇప్పుడు వార్డుల్లో ఉండే పేషెంట్లే తక్కువ. ఉన్న వారికి సరైన రీతిలో వైద్య సేవలు అందించకపోవడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడం, కొంతమంది నర్సులు రోగులను, వారి బంధువులను ఈసడించుకోవడం జరుగుతూనే ఉన్నా అధికారులు తమకు ఏమి పట్టనట్లుగా వ్యవహరించడం వెనుక ఉన్న కథేమిటో ఉన్నతాధికారులే తేల్చాల్సి ఉంది.


సుబుద్ధిని పరామర్శిస్తున్న దెందులూరు ఎమ్మెల్యే ప్రభాకర్


దెందులూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న సుబుద్ధి


సిజేరియన్ చేశాక కుట్ల పరిస్థితి

ప్రాణాపాయ స్థితిలో చల్లచింతలపూడి బాలింత


ఆసుపత్రిలోని వైద్యులు, నర్సుల, సిబ్బంది నిర్లక్ష్యంతో మరో బాలింత ప్రాణాపాయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతూ దెందులూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుంది. దెందులూరు మండలం చల్లచింతలపూడికి చెందిన చవల పవన్‌కుమార్ భార్య సుబుద్ధి నిండు గర్భిణి కావడంతో ఆమెకు ఈనెల 11న నొప్పులు రావడంతో ఏలూరు ప్రభుత్వాసు పత్రిలోని ఎంసీహెచ్ విభాగంలో చేర్పించారు. అక్కడ వైద్యులు 13వ తేదీన సిజేరియన్ చేశారు. ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. కుట్లు సక్రమంగా వేయకపోవడం, దూరం దూరంగా వేయడం, బ్యాండేజ్ వేసి సరైన వైద్య సేవలు అందించకపోవడం, అక్కడ ఉన్న నర్సులు, సిబ్బంది సరైన శుభ్రం చేయకపోవడంతో ఆమెకు కుట్లు విడిపోయాయి. ఈ సమాచారాన్ని నర్సులకు చెప్పడంతో బ్యాండేజ్ వేసి స్టిక్కర్ అంటించి ఈనెల 18వ తేదీన ఇంటికి పంపించారు. ఆమె పరిస్థితి ప్రమాదకరంగా మారింది. కుట్ల వద్ద పస పట్టి దుర్గంధం వెదజల్లడం, ఇన్‌ఫెక్షన్ ఎక్కువ కావడంతో కుటుంబ సభ్యులు వెంటనే దెందులూరు ప్రభుత్వా సుపత్రిలో 22న చేర్పించారు. ప్రస్తుతం ఆమె అక్కడ వైద్యం పొందు తుంది. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆమెను పరామర్శించారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఎంసీహెచ్ విభాగంలో జరుగుతున్న ఘటనలపై పూర్తిస్థాయి విచారణ జరపాలని, రోగులకు మెరుగైన వైద్యం అందేలా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

రేపు సెట్‌వెల్ కార్యాలయంలో జాబ్‌మేళా

ఏలూరు కార్పొరేషన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ప్రాంగణంలోని సెట్‌వెల్ కార్యాలయంలో ఈనెల 27న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి వి.వరలక్ష్మి గురువారం తెలిపారు. ఎల్ఐసీ బీమా సఖీ ప్రోగ్రాం అర్హత పదవ తరగతి కాగా 18 ఏళ్ళు వయస్సు పైబడి ఉండాలని, ఎంపికైన వారికి స్టైఫండ్ ఉందన్నారు. హ్యాపీ మొబైల్ కంపెనీ కూడా పలువురికి ఉద్యోగాలు ఇవ్వనుందన్నారు. అవసరమైన పత్రాలు తీసుకురావాలని సూచించారు. రిజిస్ట్రేషన్ కోసం వెబ్‌సైట్ అందుబాటులో ఉంటుందని వరలక్ష్మి తెలిపారు.

సీఆర్ఆర్ మహిళా కళాశాలలో దసరా వేడుకలు

పెదపాడు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వట్లూరులోని సీఆర్‌రెడ్డి మహిళా కళాశాలలో దసరా నవరాత్రి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. దుర్గమ్మ అమ్మవారిని కాత్యాయినిదేవిగా అలంకరించి విద్యార్థినులు ప్రత్యేక పూజలు చేశారు. దేవీ నవరాత్రుల విశిష్టతను తెలియజేసేలా విద్యార్థినులు సాంస్కృతిక ప్రదర్శనలు, కోలాటం ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ ప్రసాద్, డాక్టరు కిషన్, వంకినేని భానుప్రకాష్, ప్రిన్సిపాల్ సరళ తదితరులు పాల్గొన్నారు.


కొయ్యలగూడెం, ఏలూరులో కాత్యాయిని అలంకరణలో అమ్మవారు, ఏలూరులో వారాహిదేవి అమ్మవారుగా పార్వతిదేవి

కాత్యాయినిదేవిగా అమ్మవారి దర్శనం

ఏలూరు కార్పొరేషన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): నగరంలో అమ్మవారి ఆలయాల వద్ద దేవీ నవరాత్రులు నాలుగో రోజు గురువారం కాత్యాయినీ దేవిగా అలంకరించారు. అంబికాదేవి, సౌభాగ్యలక్ష్మీదేవి, కనకదుర్గమ్మ కాత్యాయినిగా దర్శనమివ్వగా కంచికామకోటి పీఠం వద్ద అమ్మవారికి అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. బావిశెట్టివారిపేట కనకదుర్గాంబను వనదుర్గాదేవిగా అలంకరించారు. సత్యనారాయణపేట కాలువ గట్టు వద్ద ఉన్న గంగా పార్వతీ సమేత రేవులింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవి అమ్మవారిని వారాహిదేవిగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు.

తాడిచర్లలో అమ్మవారికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

కామవరపుకోట, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): తాడిచర్ల శివాలయం వద్ద దేవీ నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం అమ్మవారు కాత్యాయినీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సర్పంచ్ పసుమర్తి పార్థసారధిబాబు, మిత్రబృందం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీలక్ష్మీ హయగ్రీవ లలితా పీఠంలో అమ్మవారికి కాశీ అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. సుదర్శనం రామదుర్గ కుమారాచార్యులు, శ్రీనివాసాచార్యులు భక్తులతో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

భీమడోలు: గుండుగొలను, పూళ్ల, భీమడోలు, తదితర గ్రామాల్లో అమ్మవార్లను కాత్యాయినీ దేవిగా అలంకరించి పూజలు చేశారు. భీమడోలులోని రావిచెట్టు ప్రాంతంలో కనకదుర్గమాతకు విశేష పూజలు చేశారు.

నిడమర్రు: మందలపర్రు ఉమానీలకంఠేశ్వర క్షేత్ర దేవత ఉమాదేవి అమ్మవారు కాత్యాయినీ దేవిగా పూజలందుకొన్నారు. ఫత్తేపురం సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో అమ్మవారికి ఆలయ అర్చకులు పూజలు చేశారు.

కొయ్యలగూడెం: కాత్యాయిని అవతారంలో కనకదుర్గమ్మను దర్శించుకోడానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బుట్టాయగూడెం: గుబ్బల మంగమ్మను కూరగాయలతో కమిటీవారు అలంకరించారు. రెడ్డిగణపవరం, బుట్టాయగూడెం ప్రాంతాల్లో కనకదుర్గమ్మ కాత్యాయని దేవిగా దర్శనమిచ్చారు.

అంబికా దేవికి ఎంపీ మహేశ్ పూజలు



ఎంపీని ఆశీర్వదిస్తున్న అర్చకులు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): సత్రంపాడులో అంబికాదేవిని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ గురువారం దర్శించుకుని పూజలు చేశారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ నివాసానికి చేరుకున్నారు. అక్కడి నుంచి రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణతో కలిసి అంబికాదేవి ఆలయాన్ని సందర్శించారు. ఏలూరు జిల్లా అభివృద్ధి కోసం చేస్తున్న పనులన్నీ విజయవంతం కావాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.

సుందరగిరిపై సుదర్శన హోమం



హోమం నిర్వహిస్తున్న పండితులు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఐఎస్ జగన్నాధపురంలో సుందరగిరిపై లక్ష్మీ నారసింహుని ఆలయంలో స్వామివారి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని గురువారం విశేష కార్యక్రమాలు జరిగాయి. యాగ శాలలో పుణ్యహవచన, కలశస్థాపన నిర్వహించారు. అనంతరం శ్రీసుదర్శన నృశింహ ధన్వంతరి గరుడ ఆంజనేయ అనంత మూల మంత్ర హోమం జరిగింది. మూలవిరాట్‌కు విశేష ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు.

అదనపు కట్నం వేధింపుల కేసు నమోదు

టి.నరసాపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జయబాబు తెలిపారు. కామవరపుకోట మండలం సాగిపాడు గ్రామానికి చెందిన ముంగమూరి వందనంకి వెలగపాడు గ్రామానికి చెందిన లలితకుమారితో వివాహమైంది. ఇటీవల వ్యసనాలకు బానిసై అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్నాడు. భార్య పుట్టింటి వద్ద ఉండగా ఈ నెల 1న మద్యం మత్తులో గొడవపడ్డాడు. భార్య ఫిర్యాదుతో గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పశువులు తరలిస్తున్న నలుగురు అరెస్ట్

భీమడోలు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): భీమడోలు మండలం పోలసానపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా వ్యానులో పశువులను తరలిస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. పశువుల దొంగతనాలపై అందిన ఫిర్యాదు మేరకు ఈ నెల 24న రాత్రి పోలసానపల్లి బ్రిడ్జి సమీపంలో భీమడోలు ఎస్ఐ సుధాకర్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. చిలకలూరి పేటకు చెందిన దుగ్గింపూడి అశోక్‌రెడ్డి, హర్యానా రాష్ట్రానికి చెందిన నయింఖాన్ సలాం అహ్మద్, ఇమ్రాన్‌ను అరెస్టు చేసి పశువులను తరలిస్తున్న వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మగ్గింపూడి అశోక్ రెడ్డి వ్యాపార లావాదేవీల కోసం హర్యానాకు చెందిన వారితో దొంగతనాలకు ప్రేరేపిస్తున్నట్లు విచారణలో తేలిందని ఎస్ఐ తెలిపారు.

సారాపై ఎక్సైజ్ సిబ్బంది విస్తృత దాడులు

ఏలూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ నేరాలను అరికట్టేందుకు అధికారులు, సిబ్బంది గురువారం పలుచోట్ల దాడులు నిర్వహించారు. చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నాగిరెడ్డిగూడెం, సామవరం, సీతానగరం, చింతలపూడి గ్రామాల్లో వడిత్య పున్న, బాణావతు లలిత, వడిత్య చిలక్కమ్మ, భూక్యాలక్ష్మిలను అరెస్టు చేశారు. ఎక్సైజ్ ఏఎస్పీ జి.పాండురంగారావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ అజయ్‌కుమార్ సింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

బీరువాలో నగదు, వెండి, బంగారు వస్తువులు మాయం

ఏలూరు క్రైం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వేసిన తాళాలు వేసినట్లే ఉన్నాయి. బీరువాలో బంగారం, వెండి, నగదు మాయం కావడంతో బాధితులు త్రి టౌన్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. వట్లూరునకు చెందిన గట్టా ధనలక్ష్మి భర్త కాలిరి ఆపరేషన్ జరగడంతో పది రోజులు ఆసుపత్రిలో ఉన్నారు. అంతకు ముందు బీరువా తాళాల సెట్టు పోయింది. పది రోజుల తర్వాత ఇంటికి వచ్చేసరికి ఇంటి, బీరువా తాళాలు యధాతధంగా ఉన్నాయి. బీరువాలోని ఆరు కాసుల బంగారు ఆభరణాలు, పది తులాల వెండి వస్తువులు, రూ.25 వేల నగదు అపహరణకు గురికావడంతో త్రి టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ వి కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ ముఠా సంచారంతో కలకలం

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): చోరీ ముఠా సంచారంపై సోషల్ మీడియా ప్రచారం కలకలం రేపింది. పోలీసులు సైతం హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఈ ముఠా లాడ్జీలలో ఉంటూ దొంగతనానికి పాల్పడుతు న్నట్లు చెబుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. కొత్త వారి సంచారంపై తమకు సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు.



పెదవేగి మండల పరిషత్ ఆవరణ శుభ్రం చేసిన అధికారులు



చింతలపూడిలో నాయకులు, మునిసిపల్ కమిషనర్ ప్రదర్శన



పోలవరం పంచాయతీ ఆవరణ శుభ్రం చేస్తున్న అధికారులు

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పెదవేగి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతపైనే ప్రజల ఆరోగ్యం ఆధారపడి ఉందని, ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీవో కె.రవికుమార్ అన్నారు. స్వర్ణ ఆంధ్రా- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయం ఆవరణ శుభ్రం చేశారు. రోజుకు ఒక గంట చొప్పన అందరూ పరిసరాల పరిశుభ్రత చేపట్టాలన్నారు. ఏపీవో హేమలత, ఈవో పీఆర్డీ షరీఫ్, ఆలీ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● **చింతలపూడి:** పరిసరాలను ప్రతీ ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్యాన్ని కాపాడుతుందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాటి అప్పారావు అన్నారు. పట్టణంలోని మినీ బస్టాండ్ వద్ద స్వచ్ఛతాహీ సేవ 2025 కార్యక్రమంలో భాగంగా ఒకరోజు ఒక గంట ఒకే సమయం నినాదంతో గురువారం శ్రమదానం నిర్వహించారు. మునిసిపల్ కమిషనర్ అంబటి రాంబాబు, సొసైటీ అధ్యక్షుడు తిరిమిల్లి రామారావు, కూటమి నాయకులు బోడా నాగభూషణం, ఎస్.రవికుమార్, ఎం.సత్తిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

● **లింగపాలెం:** స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యులై పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని డిప్యూటీ ఎంపీడీవో ఎ.సుందరి అన్నారు. మండలంలో గురువారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ, వైద్యసిబ్బంది, గ్రామస్తులతో కలసి పరిసరాలను శుభ్రం చేశారు. సచివాలయ, వైద్యసిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

● **జీలుగుమిల్లి:** స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో పీహెచ్‌సీ వద్ద పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య శిబిరం నిర్వహించి వైద్య పరీక్షలు చేశారు. ఎంపీడీవో టి.నిఖిల్ మధుశరణ్ వైద్యులు బి.మణికంఠేశ్వరరావు, పి.పవన్‌కుమార్ వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. వ్యక్తిగత శుభ్రతతోపాటు పరికరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. దర్భగూడెంలో సర్పంచ్ సున్నం ఉషారాణి, పి.అంకంపాలెంలో నాలి శ్రీను ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యదర్శి బలే ప్రసాద్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు తమ్మన సాంబశివ ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

● **పోలవరం:** పోలవరం పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం ఎంపీడీవో మణికుమారి ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటి ఎంపీడీవో రవికుమార్, కార్యదర్శి వై కొండల రావు, సర్పంచ్ పొడుం పుష్ప, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే అంటు వ్యాధులు దూరం

ఏలూరు రూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత కు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా అంటువ్యాధులను దూరం చేయవచ్చని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవింద రావు అన్నారు. గుడివాకలంక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై స్థానికులకు అవగాహన కల్పించారు. వాతావరణంలో మార్పుల వలన జ్వరాలు ఇతర అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. దోమల వ్యాప్తి వ్యాధులు ప్రబలుతాయన్నారు. ర్యాలీ నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఆరోగ్య విస్తరణ అధికారి ఉమామహేశ్వరరావు, హెచ్ఎస్ శేషావతారం, యోహాన్, మేక శ్రీనివాసరావు, జి.విజయకుమారి పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

రైతుల సంక్షేమమే ధ్యేయం

కాలారి శ్రీనాథ్ చౌదరి,
చాటపర్రు సొసైటీ అధ్యక్షుడు



● **యూరియా అందుబాటులో ఉందా?**

రైతులకు అందించేందుకు 24 టన్నుల యూరియా సిద్ధంగా ఉంది. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సహకారంతో ఖరీఫ్, రబీ సీజన్లకు రైతులకు కావల్సినంత యూరియా, ఇతర ఎరువులు అందుబాటులో ఉంచాం.

● **రైతులకు అందించే రుణాలు?**

సన్న చిన్నకారు రైతులకు వ్యవసాయ, దీర్ఘకాలిక రుణాలు అందిస్తున్నాం. ప్రస్తుతం సొసైటీలో 12 కోట్లు నిల్వ కలిగి ఉన్నాం.

● **సొసైటీ ద్వారా సేవలు?**

రైతులకు పశువుల దాణా, కామధేను సీడ్స్ అందిస్తున్నాం. 20 నుంచి 25 కేజీల బస్తాలు సిద్ధంగా ఉన్నాము. వీటితో పాటు కాంప్లెక్స్ ఎరువులు కూడా అందిస్తున్నాం.

● **అధ్యక్షుడిగా మీ లక్ష్యం?**

సొసైటీ పరిధిలోని రైతులు ఇబ్బందులు పడకుండా వారికి పంట రుణాలు, పెట్టుబడి సాయం అందిస్తున్నాం. రైతుల సహకారంలో సొసైటీని మరింతగా అభివృద్ధి పథంలో నడిపిస్తాం.

- ఏలూరు రూరల్, ఆంధ్రజ్యోతి




ఉపాధ్యాయ నియామకాలకు ఎంపికైన అభ్యర్థులతో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, చింతలపూడి ఎమ్మెల్యే రోషన్‌కుమార్

నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపిన మెగా డీఎస్సీ

పెదవేగి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ నిరుద్యోగ అభ్యర్థుల కుటుంబాల్లో వెలుగులు నింపింది. డీఎస్సీ ప్రకటనతో శిక్షణ తీసుకున్న అభ్యర్థులు మెరుగైన ప్రతిభ కనబర్చిన అభ్యర్థులు ఉద్యోగాలు పొందారు. అమరావతిలో గురువారం జరిగిన కార్యక్రమంలో సీఎం సమక్షంలో నియామక పత్రాలు అందుకున్నారు. నియామక పత్రాలు అందుకున్న 38మంది అభ్యర్థులు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆయన ఏర్పాటు చేసిన శిబిరంలో శిక్షణ తీసుకున్న 500మంది అభ్యర్థుల్లో 38మంది ఉద్యోగాలు పొందారు. వారంతా నియామక పత్రాలు తీసుకున్న అనంతరం ఎమ్మెల్యే ప్రభాకర్ దగ్గరకు వెళ్లి కృతజ్ఞతలు తెలిపారు. మీరు ఇప్పించిన శిక్షణతోనే ఈరోజున ఉద్యోగ నియామక పత్రాలు అందుకోగలిగామని వారంతా హర్షం వ్యక్తం చేశారు.

● ఏలూరు టూటౌన్: విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే చంటి అన్నారు. అమరావతిలో జరిగిన మెగా డీఎస్సీ ఉత్సవ్‌లో ఏలూరు నియోజకవర్గంలో సెలెక్ట్ అయిన ఉపాధ్యాయులకు నియామకపత్రాలు అందజేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చిందన్నారు.

● నిడమర్రు: ఉపాధ్యాయులు తమ బోధనతో విద్యార్థులను తీర్చిదిద్దాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. అమరావతిలో జరిగిన ఉపాధ్యాయ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో స్థానిక అభ్యర్థులకు ఎమ్మెల్యే ధర్మరాజు నియామకపత్రాలు అందజేశారు. పెదనింద్రకొలను గ్రామానికి చెందిన గాయత్రి, దేవర గోపవరం గ్రామానికి చెందిన అనిత నియామకపత్రాలు అందుకున్నారు.

● చింతలపూడి: నియోజకవర్గంలో ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన వారికి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించి ఎంపికైన వారికి నియామకపత్రాలు అందించిందన్నారు. జిల్లాలోనే అత్యధిక సంఖ్యలో విజయం సాధించిన నియోజకవర్గ అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపి వారిలో ఆనందం పంచుకున్నారు.




నియామకపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యేలు చంటి, ధర్మరాజు

మెగా డీఎస్సీ ఒక సువర్ణాధ్యాయం

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం కొత్త ఉపాధ్యాయులను నియమించిందని, రాష్ట్ర చరిత్రలోనే సువర్ణాధ్యాయమని టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిశోర్ అన్నారు. టీడీపీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1994 నుంచి 2025 వరకు 14 డీఎస్సీల ద్వారా వేల టీచర్ పోస్టులను భర్తీ చేసిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నంబూరి రామచంద్రరాజు, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, పెనుమర్తి రామకుమార్, షేక్ ముస్తఫా, బొబ్బర రాజ్‌పాల్ కుమార్, మానికల నాగేశ్వరరావు, పాతూరి అంబేడ్కర్, కౌన్సిలర్ కరుటూరి రమాదేవి, కంపా రాజేంద్ర, ఇనగడప రామాంజనేయులు, కోనేటి చంటి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పొగాకు పండించడంతో అధిక ధర

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎన్ఎల్ఎస్ పరిధిలో రైతులు క్వాలిటీ పొగాకు పండించడం వల్లనే మంచి ధరలు వస్తున్నాయని పొగాకు బోర్డు ఈడీ బి.విశ్వశ్రీ అన్నారు. జంగారెడ్డిగూడెంలోని 1,2 పొగాకు వేలం కేంద్రాలను గురువారం ఆమె పరిశీలించారు. సీటీఆర్ఐ, ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతుల అవగాహన సభలో ఆమె మాట్లాడారు. పొగాకు వేలం ప్రారంభంలో కిలో పొగాకు ధర రూ.430 వరకు రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. పొగాకు బోర్డు నిర్దేశించిన పొగాకును మాత్రమే రైతులు పండించాలని సూచించారు. రైతుల కుటుంబాలలో యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణ ఇస్తున్నామన్నారు. పొగాకు బోర్డుకు సంబంధించిన ఉద్యోగాలను త్వరలో భర్తీ చేస్తామన్నారు. కార్యక్రమంలో పొగాకు వేలం అధికారులు, రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

వైసీపీకి షాక్

(3వ పేజీ తరువాయి)

అయిన ఎంపీపీ పదవిని ఆశించిన బండారు నాగుకు వైసీపీ షాక్ ఇచ్చి దాసరి హైమావతిని అప్పటి ఎమ్మెల్యే కొట్టు సత్యనారాయణ ఎంపిక చేశారు. గతంలోనూ ఒక పర్యాయం ఎంపీపీగా కొనసాగిన ఆమెకు మళ్లీ అవకాశం ఇవ్వడంతో పార్టీలో అసంతృప్తి నెలకొంది. మరోవైపు దాసరి హైమావతికి రెండేళ్లు, పెంటపాడు ఎంపీటీసీ రెడ్డి సూరిబాబుకు, జట్లపాలెం ఎంపీటీసీ కట్టుబోయిన వెంకటలక్ష్మిలకు చెరో ఏడాదిన్నర ఎంపీపీగా ఉండేందుకు ఒప్పందం కుదిరినట్టు సమాచారం. అయినప్పటికి ఇది అమలు కాలేదు. నాలుగేళ్లుగా హైమావతే ఎంపీపీగా కొన సాగుతున్నారు.

పట్టు బిగించిన జనసేన

గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ వైసీపీ ఘోర ఓటమి ఇది ఓ కారణంగా చెబుతారు. ఈ నేపథ్యంలో జనసేన ఎమ్మెల్యేగా ఎన్నికైన బొలిశెట్టి శ్రీనివాస్ ఎంపీపీ పీఠంపై దృష్టి సారించారు. తొమ్మిది మంది వైసీపీ సభ్యుల తోపాటు జనసేన మేండేట్‌పై గెలిచిన రావి పాడు ఎంపీటీసీ సభ్యుడు కూడా జనసేనలో చేరారు. దీంతో జనసేన బలం 11కు చేరింది. దీనితోపాటు తెలుగుదేశం సభ్యులు ఇద్దరు, కోరుమిల్లికి చెందిన వైసీపీ ఎంపీటీసీ అవిశ్వాస తీర్మానానికి మద్దతు తెలిపారు. ఉద్యోగం నిమిత్తం వైసీపీ సభ్యుడు ఒకరు రాజీనామా చేశారు. దీంతో ఎంపీపీకి వ్యతిరేకంగా 14 మంది, అనుకూలంగా నలుగురు సభ్యులు నిలిచారు. ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం పెడతారని ముందే అంతా ఊహించారు. నెల క్రితం జనసేన, టీడీపీ సభ్యులు సమావేశమై ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. నాలుగేళ్లు పూర్తయితేనే ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశం ఉంటుంది. అప్పటి వరకు వేచిచూశారు. గురువారం 14 మంది సభ్యులు ఆర్డీవో ఖతీబ్‌ఖౌసర్‌బనో, ఇన్‌చార్జి ఎంపీడీవో టీవీ సత్యనారాయణ, జడ్పీ సీఈవో, డీడీవోలకు నోటీసులు అందజేశారు. ఫుల్లా బాబి, కొవ్వూరి లక్ష్మణ రెడ్డి, బండి పెద్దిరాజు, దాసరి శ్రీనివాస్, కసిరెడ్డి మధులత, ఖైలవరపు పెదబాబు తదితరులు పాల్గొన్నారు. ఆర్డీవో నెలరోజుల్లో ఎన్నిక నిర్వహించాలి. ఎంపీపీగా కట్టుబోయిన వెంకటలక్ష్మికి అవకాశాలు ఉన్నాయి.

ఫార్మాసిస్టులు నూతన ఆవిష్కరణలు చేయాలి


ఏలూరు అర్బన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఫార్మాసిస్టులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని సీఆర్ఆర్ విద్యాసంస్థల పాలకవర్గ కార్యదర్శి మాగంటి ప్రసాద్ అన్నారు. సీఆర్ఆర్ ఫార్మాస్యూటికల్ కళాశాలలో గురువారం ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం నిర్వహించారు. ఫార్మసీ రంగంలో నూతన ఆవిష్కరణలు, ఉత్పత్తులు, పరిశోధనలపై చర్చా గోష్టి, ప్రదర్శనలు జరిగాయి. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎం.విక్రమ్ మాట్లాడుతూ కొత్త రోగాలు, వైరస్‌లు విజృంభిస్తున్న వేళ ప్రాథమిక దశలోనే నివారించేందుకు లేదా నియంత్రించేందుకు ఫార్మసిస్టులు విస్తృత పరిశోధనలు చేయాలన్నారు. ఈ-పోస్టర్ ప్రజెంటేషన్, లోగో డిజైనింగ్, కల్చరల్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. విక్రమ్, సర్వజన ఆసుపత్రి ఇన్‌చార్జి సీపీవో ఎంవీఎస్ఎల్.తులసిని కళాశాల యాజమాన్యం సత్కరించింది. కరస్పాండెంట్ నానాజీ, ప్రిన్సిపాల్ ఎ.నరేంద్రబాబు, అధ్యాపకులు, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు మనోజ్‌కుమార్, మృదులరాజ్, శైలజ, పమ్మి ఉషశ్రీ, ఫరహీన్ మాలిక్ పాల్గొన్నారు.

ఏజెన్సీలో భూసేకరణ నిలుపుదల చేయాలి

బుట్టాయగూడెం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు గిరిజన నిర్వాసితులకు పునరావాసం కల్పించడానికి బుట్టాయగూడెం, జీలుగుమిల్లి ఏజెన్సీ మండలాల్లో భూసేకరణ చేయవద్దని, మైదాన ప్రాంత అడవులను సేకరించి షెడ్యూల్ ప్రాంతంగా నోటిపై చేయాలని ఆదివాసీ జేఏసీ డిమాండ్ చేసింది. ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుంజా కృష్ణంరాజు అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో జేఏసీ వైస్ చైర్మన్ మొడియం శ్రీనివాసరావు మాట్లాడారు. ఆయుధ కర్మగారాన్ని అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేయాలన్నారు. కొయ్యలగూడెం, గోపాలపురం, చింతలపూడి, నల్లజర్ల, గోకవరం మండలాల్లో మైదాన ప్రాంత అడవులను సేకరించి నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని కోరారు. గౌరవాధ్యక్షుడు తెల్లం రాములు, తెల్లం గంగరాజు, కోర్స నాగేశ్వరరావు, కుంజా రమేష్, పూసం శ్రీను, కారం వెంకటేశ్వరావు, తెల్లం శ్రీనివాసరావు, కంగాల శ్రీనివాసరావు, మడకం దుర్గారావు పాల్గొన్నారు.

ఆక్వా చెరువులకు.. రిజిస్ట్రేషన్!

(3వ పేజీ తరువాయి)



అవసరం లేదని మత్స్య శాఖ అధికారులు చెబుతున్నారు.

రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ప్రతి రైతుకు ఆక్వా రాయితీలు అందాలనే సదుద్దేశంతో ఆక్వా చెరువుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించాం. ఏపీఎస్ఏడీ చట్టం 2020 పరిధిలోకి ప్రతి రైతును తీసుకొచ్చి ప్రభుత్వ రాయితీ ఫలాలు అందించడానికి ఈ రిజిస్ట్రేషన్ తప్పనిసరి. గతం కంటే భిన్నంగా ఆక్వాజోన్, నాన్‌ఆక్వా జోన్‌లతో సంబంధం లేకుండా మీసేవ సర్టిఫికెట్ ఉన్నవారు, పాత లైసెన్స్ ఉన్నవారు నమోదు చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ కోసం ఆక్వా రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. 30 రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి సచివాలయాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నాం. - బి.నరసయ్య, జిల్లా మత్స్యశాఖాధికారి

స్వదేశీ వస్తు వినియోగం దిశగా ముందుకెళ్లాలి

పెదపాడు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఆత్మనిర్భర్ భారత్ దిశగా ముందుకెళుతోందని, ప్రతి ఒక్కరూ స్వదేశీ వస్తు వినియోగం దిశగా ముందుకెళ్లాలని ఎంపీ పాక సత్యనారాయణ అన్నారు. వట్లూరులోని రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాలలో దీన్ దయాల్ ఉపాధ్యాయ జీవితం, ఆత్మ నిర్భర్ భారత్ - ఓకల్ ఫర్ లోకల్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ దేశాభివృద్ధిలో యువత కీలకం కావాలని పిలుపునిచ్చారు. కట్నేని కృష్ణప్రసాద్, విక్రమ్ కిశోర్, సుధాకర్‌కృష్ణ, చక్రవర్తి, మాలతిరాణి, ఎం.రంగారావు, బీరయ్య, రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చర్చికి రూ.లక్ష విలువైన టైల్స్ విరాళం



చర్చిలో మాట్లాడుతున్న మల్లుకుంట సొసైటీ చైర్‌పర్సన్ సాయివినయ్

టి.నరసాపురం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆర్‌సీఎం చర్చి నిర్మాణానికి రూ.లక్ష విలువైన టైల్స్ విరాళం ఇస్తానని మల్లుకుంట సొసైటీ చైర్‌పర్సన్, టీడీపీ యువనాయకుడు శీలం సాయివినయ్ హామీ ఇచ్చారు. వీరభద్రవరంలో నిర్మిస్తున్న చర్చిని గురువారం ఆయన సందర్శించారు. చర్చిఫాదర్, సంఘ విశ్వాసులు, పెద్దలతో చర్చించారు. చర్చి నిర్మాణానికి సాయం అందించాలని కోరడంతో టైల్స్ ఇస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాస్టర్ ఏసుపాదం, సంఘ పెద్దలు గంటా ధర్మారావు, యడ్లపల్లి సీతారాములు, గంటా వెంకటేశ్వరరావు, గెడ్డం బాలరాజు, గంటా భరత్, గడ్డం నాగేంద్ర, తదితర విశ్వాసులు పాల్గొన్నారు.

చిన్నారుల దత్తత పారదర్శకంగా ఉండాలి

ఏలూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): చిన్నారుల దత్తత కార్యక్రమాన్ని పారదర్శకంగా అమలు చేయాలని, పిల్లలు లేని దంపతులకు ఇవ్వడం శ్రేయస్కరమని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. నగరంలో శిశుగృహలో ఆశ్రయం పొందున్న ఏడు నెలలు బాలుడు రామ్‌చరణ్‌ను తెలంగాణ రాష్ట్రానికి చెందిన సర్గం ఆంజేయులు, గాయత్రి దంపతులకు కలెక్టర్ గురువారం దత్తత ఇచ్చారు. మహిళా, శిశుఅభివృద్ధి సంస్థ పీడీ పి శారద, బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సూర్యచక్రవేణి పాల్గొన్నారు.

లక్ష్య సాధ్యనతోనే ఏదైనా సాధ్యం

చింతలపూడి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): లక్ష్య సాధనతోనే ఏదైనా సాధ్యమవుతుందని చాట్రాయి ఎంఈవో మానగిరి శ్రీనివాస్ అన్నారు. పోతునూరులో ఏకలవ్యుడు విగ్రహాన్ని గురువారంఆయన ఆవిష్కరించారు. ఎరుకల కులానికి రిజర్వేషన్లలో అన్యాయం జరుగుతుందన్నారు. ఎరుకలు వృత్తితోపాటు చదువులో లక్ష్యాన్ని చేదించాలన్నారు. తాడేపల్లిగూడెం మునిసిపల్ కమిషనర్ మానగిరి ఏసుబాబు మాట్లాడుతూ అంబేడ్కర్ అందించిన రిజర్వేషన్ ఫలాలు అందుకుని ముందుకు సాగాలన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు రూరల్ :** శనివారపుపేట బందుల దొడ్డి ప్రాంతంలోని పరిశుద్ధ మార్కు పిఎస్ఐ దేవాలయం గోపుర నిర్మాణానికి గురువారం శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు డి ఏశావు, సీహెచ్ శ్యామ్సన్, కోపల్లి శామ్యూల్, రాజా దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.
- **కామవరపుకోట :** రావికంపాడు పీహెచ్‌సీ ఆవరణలో గురువారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. మహిళలకు పరీక్షలు చేసి మందులు అందజేశారు.
- కామవరపుకోట మండలం వీరంపాలెంలో మొరంపూడి నరసింహారావు, మేడిపల్లి వెంకటేశ్వరరావు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ పరామర్శించారు.
- **పెదవేగి :** పేదలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పెదవేగి పీహెచ్‌సీ డాక్టర్ ప్రత్యూష అన్నారు. గార్లమడుగులో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.
- **పెదపాడు :** అప్పనవీడు అభయాంజనేయస్వామికి శ్రీరామ ఉత్సవ కమిటీ తరపున హిందు భక్తిగేయాలు, భగవద్గీత శ్లోకాలను విన్పిస్తూ ప్రతి గంటకు ఒకసారి సమయాన్ని తెలియజేసే ఎలక్ట్రికల్ గంటను గురువారం బహూకరించారు. కార్యక్రమంలో తవ్వా పూర్ణచంద్రరావు, నూకల బాలాజీ, రాఘవరావు, అంకమ్మబాబు, విజయ్ పాల్గొన్నారు.
- **దెందులూరు :** ప్రధాని మోదీ జన్మదిన వారోత్సవాలు సందర్భంగా పారిశుధ్య కార్మికులకు బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గుమ్మడి వెంకట చైతన్య కృష్ణ నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. చీకటి లక్ష్మీప్రసన్న, సర్పంచ్ ఏసమ్మ, యిప్పిలి వెంకటేశ్వరావు పాల్గొన్నారు.
- **కొయ్యలగూడెం :** స్థానిక బీసీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ గంజిమాల రామారావు గురువారం శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ నిధులతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తున్నామన్నారు. మంతెన సోమరాజు, గంటశాల సాయి, పూలపల్లి రవి, చిటికెన నాగార్జున, తదితరులు ఉన్నారు.
- **పోలవరం :** పెరటి కోళ్ల పెంపకం మహిళల ఆర్థిక అభివృద్ధికి శ్రీకారమని వెంకట్రామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రం ఎక్స్‌టెన్షన్ డైరెక్టర్ బి గోవిందరాజులు అన్నారు. గురువారం పోలవరం మండలం ఎల్ఎన్‌డీపేట పునరావాస కాలనీల వాసులకు పెరటి కోడి పిల్లలను పంపిణీ చేశారు. శాస్త్రవేత్త ఎ దేవివరప్రసాద్ రెడ్డి, కె ఆనందరావు గ్రామస్థులకు అవగాహన కల్పించారు.
- **చింతలపూడి :** సీతానగరంలో స్వస్త నారీ స్వశక్తి పరివార్ వైద్య శిబిరంలో 175 మందికి డాక్టర్ నరేష్, డాక్టర్ ఎం.సాల్మన్‌రాజు వైద్య పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ జి.మల్లేశ్వరి, కూటమి నాయకులు కక్కిరాల నాగేశ్వరరావు, ముత్తా రాజశేఖర్ పాల్గొన్నారు.

'ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధాని చిత్రపటాలు ఉంచాలి'

ఆగిరిపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధాని మోదీ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గంగవెల్లి రామకృష్ణ రంగారావు కోరారు. ప్రభుత్వ జీవోను అనుసరించి ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధాని చిత్రపటాన్ని ఉంచాలన్నారు. గురువారం పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, ఎంపీడీవో కార్యాలయాలకు ప్రధాని చిత్రపటాలను అందజేశారు. సంఘ రంగారావు, పొన్నం వెంకట రామచంద్రరావు, కొవ్వలి బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

'దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'

చాట్రాయి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి) మధ్యప్రదేశ్‌కి చెందిన ఆరుగురు దొంగల ముఠా మన ప్రాంతంలో సంచరిస్తున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చాట్రాయి ఎస్‌ఐ డి. రామకృష్ణ ప్రజలను హెచ్చరించారు. ఇప్పటికే ఈ ముఠా నెల్లూరు జిల్లా కావలి, కాకినాడ జిల్లా పత్తిపాడు, తూర్పు గోదావరి జిల్లా నల్లజర్లలో దోపిడీలు చేశారని తెలిపారు. వీరు తక్కువ ధర ఉన్న లాడ్జీలలో బస చేస్తున్నారని సమాచారమని, గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానస్పదంగా కన్పిస్తే వెంటనే 112కి ఫోన్ చేయాలని ఎస్‌ఐ తెలిపారు.

'పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం'


బలివేలో చిన్నారికి పోషకాహారం తినిపిస్తున్న రీజనల్ జాయింట్ డైరెక్టర్ సుజాత

ముసునూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పోషక విలువలతో కూడిన ఆహారాన్ని సమపాళ్లలో తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని మహిళా శిశు సంక్షేమ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ సుజాత అన్నారు. గురువారం బలివే అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, చిన్నారులకు పెడుతున్న ఆహారం, పౌష్టికాహార పదార్థాల పంపిణీ తదితర వాటిని ఆమె పరిశీలించారు. చిన్నారులకు ఆమె స్వయంగా పోషక ఆహారాన్ని తినిపించారు. అనంతరం గర్భవతులు, బాలింతలకు పౌష్టికాహారంపై జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ మాతాశిశు మరణాలను పూర్తిస్థాయిలో నివారించేందుకు ప్రభుత్వం పోషక ఆహార పదార్థాలను అందిస్తుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నూజివీడు సీడీపీవో విజయకుమారి, సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవం

ముదినేపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి):ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవాన్ని గురువారం ముదినేపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఫార్మసీ సంక్షేమ సంఘం ఉమ్మడి కృష్ణా జిల్లా ఉపాధ్యక్షుడు పి.జాన్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన ఫార్మాసిస్టుల దినోత్సవ ర్యాలీలో స్థానిక విజయ ఫార్మసీ కళాశాల విద్యార్థులు, వికాస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. మందుల వినియోగం, నాణ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో రామకృష్ణ, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ వినయ్‌కుమార్, ఎస్‌ఐ వీరభద్రరావు, ముదినేపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నాగరాజు, వైద్యుడు మనోజ్, ఏకే ఆసుపత్రి మేనేజర్ కిరణ్, కార్యదర్శి రమేష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి

నూజివీడు/నూజివీడు టౌన్/చాట్రాయి/ఆగిరిపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీ వ్యవస్థాపకుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు శివరాజువసుంధరాదేవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకులు మాగంటి వాసు, బొల్లిగర్ల సతీష్‌బాబు, షేక్ అజీజ్, జి.రాము, సీహెచ్ రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని గొల్లపల్లి గ్రామంలో గ్రామ మాజీ సర్పంచ్, నియోజకవర్గ బీజేపీ నాయకులు గొల్లపల్లి శ్రీనివాసకుమార్ అప్పారావు ఆధ్వర్యంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. చాట్రాయి మండలం చాట్రాయిలో దీన్ దయాళ్ చిత్రపటానికి బీజేపీ నాయకులు ఆదిమూలం నాగ మోహనశర్మ, నెక్కలపు వెంకటేశ్వరరావు, విద్యాధరరెడ్డి, హేమంత్, కేశవ నరశింహారావు తదితరులు నివాళులర్పించారు. ఆగిరిపల్లి మండలం, మల్లిబోయినపల్లి గ్రామంలో గురువారం బీజేపీ మండల అధ్యక్షుడు సంఘ రంగారావు ఆధ్వర్యంలో దీన్‌దయాళ్ జయంతిని ఘనంగా నిర్వహించారు.

చెక్కపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ

ముసునూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): చెక్కపల్లి గ్రామంలో ఉన్న శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని దుండగులు ఆలయం తాళాలు పగలగొట్టి హుండీలో ఉన్న నగదుతో పాటు వెండి వస్తువులను అపహరించు కుపోయారు. గురువారం ఉదయం ఆలయం తాళాలు పగులగొట్టి ఉండడంతో ఆలయ చైర్మన్ చేపూరి వెంకట మధుబాబు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఏఎస్‌ఐ బేగ్ చోరీ జరిగిన విధానాన్ని పరిశీలించారు. హుండీలో ఉన్న రూ. రెండు వేలు నగదుతోపాటు సుమారు ఎనిమిది వేలు విలువ గల వెండి వస్తువులు చోరీ అయినట్లు చైర్మన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్‌ఐ తెలిపారు.

వేధింపుల కేసులో ఏడుగురికి జైలు శిక్ష

నూజివీడు టౌన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): వేధింపుల కేసులో ఏడుగురికి జైలు శిక్ష విధిస్తూ నూజివీడు ఫస్ట్‌క్లాస్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ గురువారం తీర్పు ఇచ్చారు. నూజివీడు రూరల్ పోలీసులు తెలిపిన వివరాలివి.. నూజివీడు మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన తల్లిబోయిన జ్యోతి వరప్రసాద్ భార్య 2017లో తన భర్త వరప్రసాద్, అతని కుటుంబ సభ్యులు తనను శారీరకంగా మానసికంగా వేధిస్తున్నారంటూ రూరల్ పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టులో నిందితులను హాజరుపర్చారు. బాధితురాలి తరఫున పీపీ ప్రసన్నకుమార్ వాదనలు వినిపించారు. నిందితులు తల్లిబోయిన జ్యోతివరప్రసాద్, ప్రభాకరరావులకు రెండేళ్లు, తల్లిబోయిన వసంతరావు, గండికోట వెంకటేశ్వరరావుకు ఒక ఏడాది, తల్లిబోయిన లక్ష్మయ్య, పార్వతి, సువర్ణకుమార్‌లకు ఆరు నెలలు జైలు శిక్షలు విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పినట్టు రూరల్ ఎస్‌ఐ లక్ష్మణబాబు తెలిపారు.

వైసీపీకి షాక్

(5వ పేజీ తరువాయి)

అయిన ఎంపీపీ పదవిని ఆశించిన బండారు నాగుకు వైసీపీ షాక్ ఇచ్చి దాసరి హైమావతిని అప్పటి ఎమ్మెల్యే కొట్టు సత్యనారాయణ ఎంపిక చేశారు. గతంలోనూ ఒక పర్యాయం ఎంపీపీగా కొనసాగిన ఆమెకు మళ్లీ అవకాశం ఇవ్వడంతో పార్టీలో అసంతృప్తి నెలకొంది. మరోవైపు దాసరి హైమావతికి రెండేళ్లు, పెంటపాడు ఎంపీటీసీ రెడ్డి సూరి బాబుకు, జట్లపాలెం ఎంపీటీసీ కట్టుబోయిన వెంకటలక్ష్మిలకు చెరో ఏడాదిన్నర ఎంపీపీగా ఉండేందుకు ఒప్పందం కుదిరినట్టు సమాచా రం. అయినప్పటికి ఇది అమలు కాలేదు. నాలుగేళ్లుగా హైమావతే ఎంపీపీగా కొన సాగుతున్నారు.

పట్టు బిగించిన జనసేన

గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ వైసీపీ ఘోర ఓటమి ఇది ఓ కారణంగా చెబుతారు. ఈ నేపథ్యంలో జనసేన ఎమ్మెల్యేగా ఎన్నికైన బొలిశెట్టి శ్రీనివాస్ ఎంపీపీ పీఠంపై దృష్టి సారించారు. తొమ్మిది మంది వైసీపీ సభ్యుల తోపాటు జనసేన మేండేట్‌పై గెలిచిన రావి పాడు ఎంపీటీసీ సభ్యుడు కూడా జనసేనలో చేరారు. దీంతో జనసేన బలం 11కు చేరింది. దీనితోపాటు తెలుగుదేశం సభ్యులు ఇద్దరు, కోరుమిల్లికి చెందిన వైసీపీ ఎంపీటీసీ అవిశ్వాస తీర్మానానికి మద్దతు తెలిపారు. ఉద్యోగం నిమిత్తం వైసీపీ సభ్యుడు ఒకరు రాజీనామా చేశారు. దీంతో ఎంపీపీకి వ్యతిరేకంగా 14 మంది, అనుకూలంగా నలుగురు సభ్యులు నిలిచారు. ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం పెడతారని ముందే అంతా ఊహించారు. నెల క్రితం జనసేన, టీడీపీ సభ్యులు సమావేశమై ఏకగ్రీ వంగా నిర్ణయం తీసుకున్నారు. నాలుగేళ్లు పూర్తయితేనే ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశం ఉంటుంది. అప్పటి వరకు వేచిచూశారు. గురువారం 14 మంది సభ్యులు ఆర్డీవో ఖతీబ్‌ఖౌసర్‌బనో, ఇన్‌చార్జి ఎంపీడీవో టీవీ సత్యనారాయణ, జడ్పీ సీఈవో, డీడీవోలకు నోటీసులు అందజేశారు. పుల్లా బాబి, కొవ్వూరి లక్ష్మణరెడ్డి, బండి పెద్దిరాజు, దాసరి శ్రీనివాస్, కసిరెడ్డి మధులత, మైలవరపు పెదబాబు తదితరులు పాల్గొన్నారు. ఆర్డీవో నెల రోజుల్లో ఎన్నిక నిర్వహించాలి. నూతన ఎంపీపీగా కట్టుబోయిన వెంకటలక్ష్మికి అవకాశాలు ఉన్నాయి.

ఆక్వా చెరువులకు.. రిజిస్ట్రేషన్ !

(5వ పేజీ తరువాయి)

అవసరం లేదని మత్స్య శాఖ అధికారులు చెబుతున్నారు.

రిజిస్ట్రేషన్ తప్పనిసరి



ప్రతి రైతుకు ఆక్వా రాయితీలు అందాలనే సదుద్దేశ్యంతో ఆక్వా చెరువుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించాం. ఏపీఎస్ఏడీ చట్టం 2020 పరిధిలోకి ప్రతి రైతును తీసుకొచ్చి ప్రభుత్వ రాయితీ ఫలాలు అందించడానికి ఈ రిజిస్ట్రేషన్ తప్పనిసరి. గతంలో కంటే భిన్నంగా ఆక్వాజోన్, నాన్‌ఆక్వా జోన్‌లతో సంబంధం లేకుండా మీసేవ సర్టిఫికెట్ ఉన్నవారు, పాత లైసెన్స్ ఉన్నవారు ఈ రిజిస్ట్రేష న్‌లో నమోదు చేసుకోచ్చు. రిజిస్ట్రేషన్ కోసం ఆక్వా రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిసున్నాం. 30 రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయాలనే లక్ష్యంతో సచివాలయాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నాం.

బి.నరసయ్య
జిల్లా మత్స్యశాఖాధికారి

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

టిడ్కో ఇళ్ల సాకారమెప్పుడో ?

- ఆరున్నరేళ్లుగా ముందుకు సాగని భవన నిర్మాణ పనులు
- మంత్రి హామీతో లబ్ధిదారుల్లో ఆశలు


నూజివీడులో టిడ్కో గృహాలు

నూజివీడు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పీఎంఏవై ఎన్టీఆర్ కాలనీల ద్వారా సొంతింటి కల నెరవేర్చుకుందామని లబ్ధిదారుల ఆశ కలగానే మిగిలింది. అధికార, ప్రతిపక్షాల వద్ద ఉన్న రాజకీయవైరం లబ్ధిదారుల పాలిట శాపంగా మారడంతో దాదాపు ఆరున్నరేళ్లుగా టిడ్కోగృహ నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది. హౌసింగ్‌ఫర్ ఆల్‌స్కీమ్‌లో భాగంగా జీ+3 భవననిర్మాణాలను గత టీడీపీ ప్రభుత్వం చేపట్టింది. నూజివీడు పట్టణపరిధిలోని ఎమ్మార్ అప్పారావు కాలనీలో ఈ నిర్మాణాలకు శంకుస్థాపన చేయగా దాదాపు మూడు కేటగిరీల్లో నివాస గృహాలు ఇచ్చేందుకు నాటి ప్రభుత్వం నిర్ణయించి, ఇళ్లను రూపొందించింది. 2017లో శంకుస్థాపన సమయంలో 3,460 గృహాల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించగా దాదాపు ఏడాది పాటు ఒక్క అడుగు ముందుకు పడలేదు. నాటి ప్రతిపక్ష వైసీపీ ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు టిడ్కోభవన నిర్మాణాలు ముందుకు సాగకుండా అడుగడుగునా అడ్డుపడ్డారు. ఫలితంగా 2018 వరకు భవనాల నిర్మాణం అడుగు ముందుకు పడలేదు. అనంతరం నాటి అధికార పార్టీ నాయకులు లబ్ధిదారుల వాటాను చెల్లించేందుకు అవగాహన కల్పిస్తూ చెల్లించేలా కృషి చేశారు.

మంత్రి హామీతో చిగురించిన ఆశలు

తాజాగా రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ 2025 ఏడాది చివరలో టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందిస్తామని హామీ ఇవ్వడం, మంత్రి కొలుసు పార్థసారథి సొంత నియోజకవర్గం కావడంతో నూజివీడు పట్టణంలోని టిడ్కో లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి.

అప్పుల ఊబి నుంచి బయటపడేనా..

నూజివీడు టిడ్కో భవన సముదాయాలకు సంబంధించి లబ్ధిదారుల పేరుతో గత వైసీపీ ప్రభుత్వం బ్యాంకర్ల నుంచి రుణాలు తీసుకుని ఇతర అవసరాలకు మళ్లించింది. దీంతో ఇక్కడ భవన నిర్మాణాలకు ఒక్క ఇటుక పడలేదు. 205 మంది లబ్ధిదారుల నుంచి సుమారు రూ.60కోట్ల రుణాలను రాష్ట్రప్రభుత్వం సేకరించింది. ఈ రుణాలు తీసుకుని ఇప్పటికే దాదాపు నాలుగేళ్లు పూర్తవుతుండగా, మారటోరియమ్ పీరియడ్ ముగిసి రెండేళ్లు అవుతోంది. ఈ నేపథ్యంలో బ్యాంకర్లు టిడ్కో లబ్ధిదారులపై రుణాలు చెల్లించాల్సిందిగా ఒత్తిడి తీసుకువస్తున్నారు. మరోవైపు బ్యాంకర్లు ఇచ్చిన ప్రిన్సిపల్ రుణం మొత్తానికి వడ్డీకూడా కలిసే పరిస్థితి ఉండడంతో లబ్ధిదారులు గృహాలు పొందినా, రుణవాయిదాల మొత్తం వారికి మోయలేని భారంగా మారేపరిస్థితి నెలకొంది.

రుణాలు పూర్తిగా రద్దు చేయాలి

గత ప్రభుత్వం రూ.500 లబ్ధిదారుని వాటాగా ఉన్న సింగిల్ బెడ్‌రూమ్ ఇళ్లను మహిళలకు ఉచితంగా అందిస్తానని హామీ ఇచ్చి అందుకు సంబంధించి పట్టాలను సైతం జారీ చేసింది. అదే రీతిన కూటమి ప్రభుత్వం బీసీ కేటగిరీల్లోని వారికి సైతం టిడ్కో గృహాలను ఉచితంగా ఇవ్వాలనే వాదనలు వినిపిస్తున్నాయి. దాదాపు ఆరేళ్ల కాలం పూర్తికాగా అవి నిరుపయోగంగా ఉండడంతో శిథిలావస్థకు చేరుతున్నాయి. గత ప్రభుత్వం లబ్ధిదారులను ఏమార్చి తీసుకున్న రుణాలతో సంబంధం లేకుండా ఉచితంగా ఇవ్వాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు.


కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారి ఆలయంలో చండీహోమ పూజలో భక్తులు


నూజివీడులో కాత్యాయనిగా కోట మహిషాసురమర్దిని అమ్మవారికి పూజలు


చిన తాడినాడలో కాత్యాయనిదేవిగా అమ్మవారు


గురజలో కాత్యాయని అలంకరణలో దుర్గాదేవి

అమ్మా.. కాత్యాయని దేవి

- నాలుగో రోజు కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు
- ఆలయాలు కిటకిట

శరన్నవరాత్రి ఉత్సవాలు నాలుగోరోజు గురువారం వైభవంగా జరిగాయి. పలు అలంకరణల్లో అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చండీ హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కైకలూరు/మండవల్లి/కలిదిండి/ముదినేపల్లి,సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారి ఆలయంలో శ్రీచండీ మహాయాగ సహిత శరన్నవరాత్రి ఉత్సవాల్లో గురువారం శ్రీధాన్యలక్ష్మీ దేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి పుష్పాలంకరణ కంతేటి రామలక్ష్మణ నాగవరప్రసాద్, అలివేలు ప్రసన్నకుమారి దంపతులు చేశారు. భక్తులకు ఉచిత ప్రసాదాన్ని దాతలు లోయ రంగారావు, పచ్చిగోళ్ళ దుర్గనాగవెంకట రామకృష్ణగుప్తా, కామినేని బాల మురళీకృష్ణ అందజేశారు. ఉభయదాతల పూజల్లో 26మంది దంపతులు పాల్గొని పూజలు చేశారు. చండీహోమం పూజల్లో 11 మంది దంపతులు పూజలు నిర్వహించారు. సాయంత్రం చిన్నికృష్ణ మహిళా మురళీకోలాట ప్రదర్శన, కురెళ్ల జ్యోతి బృందంచే కూచిపూడి, భరత నాట్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఉత్సవకమిటీ సభ్యులు, ఈవో వీఎన్‌కే శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఐదో రోజు శుక్రవారం శ్రీధనలక్ష్మిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు.

కొల్లేటి కోటలో..

కొల్లేటికోట శ్రీపెద్దింటి అమ్మవారి ఆలయంలో అష్టోత్తర కలశ పూజ, పంచామృతాలతో అభిషేకాలు, పంచగవ్య ప్రాశన ఖడ్గ నామావళి కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలు కోళ్ళపర్రుకు చెందిన కనుమూరి రంగరాజు, నాగపార్వతీ దంపతులు పూజలు చేశారు. ఆలయ అధికారి కూచిపూడి శ్రీనివాసు ఏర్పాట్లు నిర్వహించారు.

మండవల్లి మండలం లోకుముడి దత్తాత్రేయలో మహిళలు కోటి కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. దత్తాత్రేయ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ గురజాడ ఉదయ శంకర్ హోమాన్ని నిర్వహించారు. కలిదిండి మండలం కోరుకొల్లు, కలిదిండి, చినతాడినాడ, భాస్కరావు పేట గ్రామాల్లో దుర్గమ్మ అమ్మవారు కాత్యాయని దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ముదినేపల్లి మండలం దేవపూడిలో ఉన్న విజయదుర్గాదేవి సమేత హిమగిరి రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉల్లంకి నగేష్ కుమార్, అశ్వనీకుమార్, కడిమి నరసింహారావు, కొమ్మూరి నిరంజనరావు దంపతులు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెయ్యేరు ఏరియాలోని కనకదుర్గా నగర్‌లో ఉన్న కనకదుర్గమ్మ కాత్యాయనీ దేవి అలంకరణలో దర్శనమివ్వగా, అల్లు శ్రీధర్ దంపతులు పూజలు జరిపారు. గురజలోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారికి కాత్యాయనీ దేవి అలంకరణ చేసి పూజలు నిర్వహించారు.

నూజివీడు/నూజివీడుటౌన్/ముసునూరు/ఆగిరిపల్లి : (నూజివీడు కోట మహిషాసుర మర్ధిని అమ్మవారు కాత్యాయినిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆగిరిపల్లి మండలం రుద్రభూమి వద్ద వున్న కనకదుర్గమ్మ ఆలయంలో చండీహోమంతో పాటు, కుంకుమ పూజలు నిర్వహించారు. ముసునూరు మండలం ముసునూరులో కనకదుర్గమ్మ అమ్మవారు కాత్యాయనీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. బలివే శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారిని కాత్యాయని దేవిగా అలంకరించి, పూజలు నిర్వహించారు.

దసరా ఉత్సవాలకు సర్వం సిద్ధం

నూజివీడు:ఆంధ్రా మైసూరుగా పేరుగాంచిన నూజివీడు దసరా ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు సిద్ధమయ్యాయని దసరా ఉత్సవ, క్రీడాసాంస్కృతిక ట్రస్ట్ (నూజివీడు స్పోర్టింగ్ క్లబ్) సభ్యులు తెలిపారు. 112 ఏళ్ల క్రితం జమిందారీ వ్యవస్థలో నూజివీడు దసరా ఉత్సవాలను ప్రారంభించామని, స్వాతంత్ర్య అనంతరం దసరా ఉత్సవాల నిర్వహణ బాధ్యతను స్పోర్టింగ్ క్లబ్‌కు అప్పగించామన్నారు. రాష్ట్రమంత్రి, కొలుసు పార్థసారథి, రూ.3లక్షలు సొంత నిధులు అందించగా, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌అప్పారావు క్రీడల అభివృద్ధికి రూ.2లక్షలు వితరణగా అందించారన్నారు. విశ్రాంత ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావు దసరా ఉత్సవాలకు నిధులు సమకూరుస్తానని హామీ ఇచ్చారన్నారు. నూజివీడు మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, కోఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకోలాహలం రాజు, పీడీ టీవీ కృష్ణారావు, మాజీ కౌన్సిలర్ ఆర్.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

కైకలూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పల్లెవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో కొత్తలైన్ల నిర్మాణం కోసం శుక్రవారం కరెంట్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ జీబీ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కైకలూరు మండలం పల్లెవాడ సబ్‌స్టేషన్ పరిధిలో అన్ని గ్రామాలకు సరఫరా నిలిపివేస్తామన్నారు.

పరస్పర దాడులు.. కేసు నమోదు

ముదినేపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పాతకక్షల నేపథ్యంలో ముదినేపల్లిలో మహిళలు ఒకరిపై ఒకరు పరస్పర దాడులకు పాల్పడిన సంఘటన ఇది. ఈనెల 21న స్థానిక గురజ రోడ్ సెంటర్‌లో అరుగుల రామలక్ష్మి అనే మహిళపై ముదినేపల్లికి చెందిన అరుగుల శిరీష, జ్యోతితోపాటు అరుగుల మహేష్ దాడి చేసి తీవ్రంగా కొట్టినట్లు, అదే సమయంలో అరుగుల జయనాగ వెంకటశిరీష అనే మహిళపై అరుగుల సుబ్బారావు, రామలక్ష్మి, అరుగుల వెంకటలక్ష్మి దాడి చేసి కొట్టినట్లు ముదినే పల్లి పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. వీటిపై రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ ఎస్‌వీ రామారావు తెలిపారు.

పెదగొన్నూరు వాసి అనుమానాస్పద మృతి


సుబ్రహ్మణ్యం (ఫైల్)

ముదినేపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పెదగొన్నూరు గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ గుబిలి భాగ్యలక్ష్మి భర్త సుబ్రహ్మణ్యం (50) బుధవారం రాత్రి కృష్ణాజిల్లా చల్లపల్లి మండలం నాగేరు గ్రామ సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉండాన్ని స్థానిక పోలీ సులు కనుగొన్నారు. కొద్ది రోజులుగా అతడు ఎక్కడ ఎన్నాడో తెలియని పరిస్థితి నెలకొంది. గ్రామానికి సుమారు 70 కిలోమీటర్ల దూరంలోని మాజేరు వద్ద శవమై కనిపించాడు. సమాచారం అందుకున్న చల్లపల్లి పోలీసులు గుర్తుతెలియని మృతదేహంగా స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై సామాజిక మాధ్యమాల్లో ఆ ప్రాంతం వారు ఫొటోతో సహా పోస్టులు పెట్టడంతో వాటిని చూసిన పెదగొన్నూరు యువకులు.. అతడి మృత దేహంగా గుర్తించి కుటుంబ సభ్యులకు తెలపడంతో పోస్టుమార్టం అనంతరం భౌతిక కాయాన్ని గ్రామానికి తీసుకువచ్చారు. అయితే 20 రోజుల క్రితం అతడిని పోలీసులు తీసుకువెళ్లారని వారు ఎక్కడి పోలీసులో, ఎందుకు తీసుకువెళ్లారో తెలియలేదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అప్పటి నుంచి భార్యతో పాటు కుటుంబ సభ్యులు అతడి ఆచూకీ కోసం ప్రయత్నం చేస్తున్నారు.

యూటీఎఫ్ మహాసభలకు తరలిన ఉపాధ్యాయులు

నూజివీడు టౌన్, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి):ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహించిన యూటీఎఫ్ రణభేరికి నూజివీడు నియోజకవర్గం నుంచి ఉపాధ్యాయులు తరలివెళ్లారు ఈ సంద ర్భంగా యూటీఎఫ్ ఏలూరు సహ అధ్యక్షుడు జి.వెంకటేశ్వరరావు, నూజివీడు మండల అధ్యక్షకార్యదర్శులు బి.బాబూరావు, చెన్నకేశవరావు మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిషన్‌ను ప్రభుత్వం నియమించాలని, 35శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మహాసభలకు తరలి వెళ్లారు.

ముసునూరు ఎంపీడీవోగా ఏసుబాబు బాధ్యతలు



ముసునూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ముసునూరు మండల ఎంపీడీవోగా పిల్లి ఏసుబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండల డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తూ పదోన్నతి పొందిన ఏసుబాబును ఉన్నతాధికారులు ముసునూరు ఎంపీడీవోగా నియమించారు. ఇప్పటివరకు ఈవోపీఆర్డీ బీవీ సత్యనారాయణ ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా వ్యవహించారు. నూతన ఎంపీడీవోకు కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పుష్పగుచ్ఛాలను అందజేసి అభినందనలు తెలిపారు. ఈవోపీఆర్డీ సత్యనారాయణ, ఏవో చాయాదేవి, సీనియర్ అసిస్టెంట్ సగ్గూర్తి శ్రీనివాసరావు, కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు వి.శ్రీనివాస చౌదిరి పాల్గొన్నారు.

కుట్లు వేశారంటే అంతే..

ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం

- పేషెంట్ల వద్దకు బంధువుల రావడం వల్లే ఇన్‌ఫెక్షన్ అంటూ అధికారుల కట్టుకథలు
- వైద్య విధాన పరిషత్‌లో ఏనాడూ ఒక్క ఫిర్యాదు లేని ఎంసీహెచ్ విభాగం

బాలింతలను వెంటాడుతున్న సిజేరియన్ల భయం


ఏలూరు ప్రభుత్వాసుపత్రిలోని ఎంసీహెచ్ విభాగం



ఏలూరు క్రైం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు, నర్సులు, సిబ్బంది నిర్లక్ష్యంతో బాలింతలు ప్రాణాపాయ పరిస్థితుల్లోకి వెళ్లిపోతున్నారు. ఎన్నిసార్లు జిల్లా కలెక్టర్ హెచ్చరించినా తమ పద్ధతి ఇంతేనంటూ కొంతమంది వైద్య సిబ్బంది తమ విధులను నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రోగుల ప్రాణాలు గాలిలో కలిసిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గతంలో జిల్లాస్థాయి సమీక్ష సమావేశంలో ఈ సమస్యలు లేవనెత్తడంతో కొంతకాలం పాటు అంతా బాగానే ఉన్నా ఆ తరువాత మళ్లీ యథావిధిగా నిర్లక్ష్య ధోరణిలోనే విధులు నిర్వర్తిస్తున్నారు.

ఏలూరు ప్రభుత్వాసుపత్రి మెడికల్ కాలేజీ టీచింగ్ ఆసుపత్రిగా 2022లో మార్పు చేశారు. అంతకు ముందు వైద్య విధాన పరిషత్‌లో కొనసాగేది. గతంలో ఏలూరు ప్రభుత్వాసుపత్రి జాతీయస్థాయిలో ఉత్తమ వైద్య సేవలు అందించిన ఆసుపత్రిగా రెండు పర్యాయాలు ప్రథమస్థాయి అవార్డును పొందింది. రాష్ట్రస్థాయిలో రెండు పర్యాయాలు అవార్డులు వచ్చాయి.

డీఎంఈ పరిధిలో అస్తవ్యస్తం

డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలోకి ఆసుపత్రి వెళ్లిన తరువాత అస్తవ్యస్తంగా మారిపోయింది. మెడికల్ కళాశాలలో అంతా సూపర్‌స్పెషాలిటీ వైద్యం అందుతుందని మాటల వరకే పరిమితం అయ్యాయి. వచ్చిన ప్రతి కేసును ఇక్కడ చేర్పించుకోకుండా రిఫరల్ చేస్తూనే ఉన్నారు. న్యూరోసర్జన్‌లో ఉన్న వార్డుల్లో పేషెంట్లను చేర్చుకోరు. తల్లీబిడ్డల విభాగంలో దారుణమైన దుస్థితి నెలకొంది. గత ఏడాది నుంచి ఈ విభాగంలో పురుడుపోసుకోవడానికి వచ్చిన గర్భిణులకు సిజేరియన్ జరిగిందంటే కచ్చితంగా వారి కుట్లు వద్ద పస పట్టడం, కుట్లు విడిపోవడం వంటివి జరుగుతూనే ఉంటున్నాయి. మళ్లీ వారిని కొద్దిరోజుల పాటు అక్కడే ఉంచి వైద్య సేవలు అందిస్తున్నారు. ఒక మహిళను మూడు నెలల పాటు ఆసుపత్రిలోనే ఉంచి ఆ కుట్లు మానేవరకు మరో విభాగంలో వైద్య సేవలు అందించారు. ప్రస్తుతం మెడికల్ కాలేజీ హాస్పిటల్ (ఎంసీహెచ్) విభాగంలో గర్భిణులకు సిజేరియన్ జరిగిందంటే వారు కచ్చితంగా ఇబ్బందులు పడతారని ప్రజలు బాహాటంగా చెప్పుకుంటున్నారు. ఎవరైనా ఇదేమిటని ప్రశ్నిస్తే పేషెంట్ల వద్దకు చూడడానికి ప్రజలు విపరీతంగా వస్తున్నారని అందువల్ల ఇన్‌ఫెక్షన్ వస్తుందని తాపీగా సమాధానం చెప్పి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు.

వైద్య విధాన పరిషత్‌లో..

వాస్తవానికి వైద్య విధాన పరిషత్‌లో ఉండగా నెలకు 500 నుంచి 650 కాన్పులను నిర్వహించే వారు. సిజేరియన్లు రోజుకు 8 వరకు చేసే వారు. కానీ ఏ ఒక్కరూ కూడా ఆ రోజుల్లో కుట్ల వద్ద పస పట్టిందనో, కుట్లు ఊడి పోయాయని ఎవరూ ఫిర్యాదులు చేయలేదు. ఇప్పుడు వార్డుల్లో ఉండే పేషెంట్లే తక్కువ. ఉన్న వారికి సరైన రీతిలో వైద్య సేవలు అందించకపోవడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడం, కొంతమంది నర్సులు రోగులను, వారి బంధువులను ఈసడించుకోవడం జరుగుతూనే ఉన్నా అధికారులు తమకు ఏమి పట్టనట్లుగా వ్యవహరించడం వెనుక ఉన్న కథేమిటో ఉన్నతాధికారులే తేల్చాల్సి ఉంది.


సుబుద్ధిని పరామర్శిస్తున్న దెందులూరు ఎమ్మెల్యే ప్రభాకర్


దెందులూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న సుబుద్ధి


సిజేరియన్ చేశాక కుట్ల పరిస్థితి

ప్రాణాపాయ స్థితిలో చల్లచింతలపూడి బాలింత

ఆసుపత్రిలోని వైద్యులు, నర్సుల, సిబ్బంది నిర్లక్ష్యంతో మరో బాలింత ప్రాణాపాయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతూ దెందులూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుంది. దెందులూరు మండలం చల్లచింతలపూడికి చెందిన చవల పవన్‌కుమార్ భార్య సుబుద్ధి నిండు గర్భిణి కావడంతో ఆమెకు ఈనెల 11న నొప్పులు రావడంతో ఏలూరు ప్రభుత్వాసు పత్రిలోని ఎంసీహెచ్ విభాగంలో చేర్పించారు. అక్కడ వైద్యులు 13వ తేదీన సిజేరియన్ చేశారు. ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. కుట్లు సక్రమంగా వేయకపోవడం, దూరం దూరంగా వేయడం, బ్యాండేజ్ వేసి సరైన వైద్య సేవలు అందించకపోవడం, అక్కడ ఉన్న నర్సులు, సిబ్బంది సరైన శుభ్రం చేయకపోవడంతో ఆమెకు కుట్లు విడిపోయాయి. ఈ సమాచారాన్ని నర్సులకు చెప్పడంతో బ్యాండేజ్ వేసి స్టిక్కర్ అంటించి ఈనెల 18వ తేదీన ఇంటికి పంపించారు. ఆమె పరిస్థితి ప్రమాదకరంగా మారింది. కుట్ల వద్ద పస పట్టి దుర్గంధం వెదజల్లడం, ఇన్‌ఫెక్షన్ ఎక్కువ కావడంతో కుటుంబ సభ్యులు వెంటనే దెందులూరు ప్రభుత్వా సుపత్రిలో 22న చేర్పించారు. ప్రస్తుతం ఆమె అక్కడ వైద్యం పొందు తుంది. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆమెను పరామర్శించారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఎంసీహెచ్ విభాగంలో జరుగుతున్న ఘటనలపై పూర్తిస్థాయి విచారణ జరపాలని, రోగులకు మెరుగైన వైద్యం అందేలా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.